TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక : 225 బుధవారం, జులై 01, 2026 పేజీలు :8 వెల.1/-

ఆరోగ్యవంతమైన మెడ్చల్ కోసం నమ్మకమైన వైద్య నిపుణులు

అత్యుత్తమమైన సేవలు,

ప్రతి అడుగులో మరింత శ్రద్ధ.

జైత్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

మా ప్రత్యేకతలు
- అత్యవసర & క్రిటికల్ కేర్
- ప్రమాద సేవలు
- ప్రస్తూతి & గైనకాలజీ
- ఆర్థోపెడిక్స్
- జాయింట్ రీప్లేస్‌మెంట్స్
- జనరల్ మెడిసిన్
- జనరల్ సర్జరీ
- మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ
- పిల్లల వైద్యం & శిశు సంరక్షణ
- న్యూరాలజీ • న్యూరోసర్జరీ
- ప్లాస్టిక్ సర్జరీ • పల్మనాలజీ
- యూరాలజీ • డెర్మటాలజీ
- సైకియాట్రీ • ఫిజియోథెరపీ




నమ్మకమైన వైద్యం | నైతిక వైద్య సేవలు | చికిత్సే ముందుగా | నిపుణుల క్లినికల్ సంరక్షణ

అన్ని ఇన్సూరెన్స్ క్యాష్‌లెస్ సౌకర్యం | 24/7 అత్యవసర సేవలు | అత్యాధునిక అంబులెన్స్

+91 85230 89599 +91 86889 09384

www.jaitrahospitals.com • ITI పక్కన, NH 44, చంద్ర నగర్, మెడ్చల్, తెలంగాణ - 501401.

## యాదాద్రి భూములపై సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిధిలో వివిధ మఠాలకు భూముల కేటాయించడానికి సంబంధించి స్పష్టమైన విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రధానంగా భూ యాజమాన్యపు హక్కులు దేవస్థానంకే ఉండాలని చెప్పారుయాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఆలయం పరిధిలో భూముల కేటాయింపు విషయంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేయాలని స్పష్టం చేశారు. యాదగిరిగుట్టలో హరే రామ హరే కృష్ణ (చారిటబుల్) ఫౌండేషన్ కోసం మార్కెట్ ధర ప్రకారం భూమిని కేటాయించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. గుట్టపైన అతిథి గృహాల నిర్మాణం కోసం ముందుకు వచ్చే వారి జాబితా రూపొందించాలని, అతిథి గృహాల నిర్మాణాల్లోనూ టీటీడీ అనుసరిస్తున్న విధానాన్ని ఇక్కడ అనుసరించాలని, దశల వారిగా అనుమతులు మంజూరు చేయాలని చెప్పారు. కుల సంఘాలకు స్థలం కేటాయింపుపైన కూడా స్పష్టమైన నిబంధనలతో కూడిన విధానం రూపొందించాలని అన్నారు. ఆలయ పరిధిలోవివిధ అభివృద్ధి పనుల కోసం భూ సేకరణ కోసం తక్షణమే నిధులు మంజూరు చేయాలని



అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట ఆలయం నిర్మాణానికి సంబంధించి ఇంజనీర్ల కమిటీ ఇచ్చిన నివేదికను సమగ్రంగా అధ్యయనంచేసి వారంలో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే, పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్య విధానంలో టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రఘువీర్, , ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, , ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తో పాటు దేవాదాయ, ఆర్థిక శాఖల, లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అధికారులు పాల్గొన్నారు

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజు



హైదరాబాద్, జూన్ 30: రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు, మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించిన కే. రామకృష్ణా రావు, ఈ రోజు పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో 1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సంజయ్ జాజును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం జూన్ 26న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు సంజయ్ జాజు నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖల విభాగాధిపతులు, సచివాలయ అధికారులు, సిబ్బంది సంజయ్ జాజుతో పాటు కే. రామకృష్ణా రావును పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

## ముఖ్యమంత్రి ని కలిసిన సంజయ్ జాజు



ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని తెలంగాణ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సంజయ్ జాజు ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత ప్రధాన కార్యదర్శి, సలహాదారు, సీఎం ఎక్స్-అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా నియమితులైన కె. రామకృష్ణా రావు కూడా ఉన్నారు.

## విద్యార్థులకు ఊరట..

### ఫీజువసూళ్లపై హైకోర్టు స్టే కొనసాగింపు

హైదరాబాద్, జూన్ 30 : ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే జులై 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో గత విచారణ సందర్భంగా జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు అప్పటివరకు కొనసాగుతాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. గత విచారణలో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయరాదని పేర్కొంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్-9లోని నాలుగు నిబంధనల అమలుపై తాత్కాలికంగా స్టే విధించింది. హైకోర్టు జారీ చేసిన ఈ మధ్యంతర ఉత్తర్వులు జులై 6వ తేదీ జరిగే తదుపరి విచారణ వరకు అమల్లో ఉంటాయని న్యాయస్థానం స్పష్టం చేసింది.దీంతో సంబంధిత విద్యాసంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న అనిశ్చితికి తాత్కాలిక ఉపశమనం లభించినట్లైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానానికి సంబంధించిన వివిధ అంశాలపై పిటిషనర్లు కోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలోని కొన్ని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. జులై 6వ తేదీ జరగనున్న తదుపరి విచారణలో ప్రభుత్వం, పిటిషనర్ల వాదనలను పరిశీలించనుంది. అనంతరం హైకోర్టు మరిన్ని ఆదేశాలు జారీ చేసే అవకాశం ఉంది.

## ఉద్యోగులకు 2 వేల కోట్లు విడుదల

హైదరాబాద్, జూన్ 30: తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పింఛన్‌దారుల దీర్ఘకాలిక బకాయిల చెల్లింపుల కోసం మరో రూ.2 వేల కోట్లను విడుదల చేస్తూ సర్కార్ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నెల రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం మొత్తం రూ.4 వేల కోట్ల నిధులను ఉద్యోగుల కోసం కేటాయించినట్లయింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు సంబంధించిన జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిలను వంద శాతం చెల్లించి, పెండింగ్ బిల్లులు లేకుండా చేసినట్లు ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగ జేఏసీకి ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లో రూ.6 వేల కోట్లు విడుదల చేసే లక్ష్యంలో భాగంగా ఈ నిధులు విడుదలయ్యాయన్నారు.తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తూ తెలంగాణ ఆర్థిక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల, పింఛన్‌దారుల బకాయిల చెల్లింపుల కోసం మరో రెండు వేల కోట్లు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల మే 29న మొదటి విడతగా రెండు వేల కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం.. సరిగ్గా నెల రోజుల వ్యవధిలోనే రెండో విడత నిధులను కూడా సర్దుబాటు చేసింది. దీంతో కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఉద్యోగ వర్గాల కోసం ప్రభుత్వం విడుదల చేసిన మొత్తం బకాయిల నిధులు నాలుగు వేల కోట్లకు చేరుకున్నాయి. ఉద్యోగ జేఏసీ నాయకులతో గతంలో జరిపిన చర్చల సారాంశం ప్రకారం.. దీర్ఘకాలంగా పేరుకుపోయిన బకాయిలను తీర్చేందుకు వంద రోజుల వ్యవధిలో ఆరు వేల కోట్లను విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ హామీని నిలబెట్టుకునే క్రమంలోనే ఈ నిధుల విడుదల వేగంగా సాగుతోంది. ఈ నిధుల విడుదలపై ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేస్తూ ఉద్యోగుల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి మరోసారి నిరూపితమైందని పేర్కొన్నారు. రాష్ట్రంలో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, నిధుల కొరత ఎదుర్కొంటున్నప్పటికీ ఉద్యోగులకు ఇచ్చిన ప్రతి మాటను నెరవేరుస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర రాయితీల బకాయిల చెల్లింపు ప్రక్రియను మరింత వేగవంతం చేశామని వివరించారు. ముఖ్యంగా పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే రిటైర్డ్ ఉద్యోగులు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు సంబంధించి చాలా కాలంగా పెండింగులో ఉన్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిలను వంద శాతం క్లియర్ చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ పరిధిలో జీపీఎఫ్ ఖాతాలకు సంబంధించిన ఎలాంటి పెండింగ్ బిల్లులూ లేవని అన్నారుదీంతో పాటు విశ్రాంత ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి సెప్టెంబరు 2025 వరకు ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ ప్రభుత్వం పూర్తిగా చెల్లించినట్లు ఆర్థికశాఖ వివరించింది. ఉద్యోగులు, పింఛన్‌దారులు గతంలో ప్రభుత్వానికి పంపిన పది వేల లోపు ఉన్న చిన్న చిన్న బిల్లులను ప్రత్యేకంగా గుర్తించి అలాంటి దాదాపు ఐదు లక్షలకు పైగా బిల్లులను వంద శాతం పూర్తిగా చెల్లించినట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ సంఘాల నేతలు తీవ్ర సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ, ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూల ధోరణితో వ్యవహరించడం అభినందనీయమని కొనియాడారు. రాబోయే రోజుల్లో మిగిలి ఉన్న ఇతర బకాయిలను కూడా ఇదే విధంగా ఒక క్రమపద్ధతిలో విడతల వారీగా చెల్లిస్తామని ఆర్థిక శాఖ అధికారులు తమకు హామీ ఇచ్చారని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వెల్లడించారు.

## హెచ్డీఎఫ్సీ బ్యాంక్ సీఎస్సార్ అభివృద్ధి పనులు ప్రారంభించి సీఎం రేవంత్

హైదరాబాద్: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (ఉూఖీ) నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ సమకూర్చిన రెండు అంబులెన్స్‌లకు ముఖ్యమంత్రి గారు జెండా ఊపి ప్రారంభించారు. భూపాలపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఎంఆర్ఐ స్కానర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి బ్యాంకు ప్రతినిధులతో మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాల నుంచి రుణాల చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయని పేర్కొంటూ



మహిళా సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని చెప్పారు. స్వయం సహాయక సంఘాలతో లాజిస్టిక్ పార్కులు, గోడౌన్లు, రైస్ మిల్లులు ఏర్పాటు చేస్తున్నామని, అందుకోసం పెద్ద ఎత్తున రుణాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాదును గ్లోబల్ ఏరోస్పేస్ - డిఫెన్స్ క్యాపిటల్గా తీర్చిదిద్దుతాం

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్: హైదరాబాద్ ఊఎఅజ లో జరిగిన ఏరోమార్ట్ హైదరాబాద్ -2026 అంతర్జాతీయ ఏరోస్పెన్‌డిఫెన్స్ బిజినెస్ కన్వెన్షను రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఏరోస్పెస్ పి.ఏ ప్రవీణ్, రీజనల్ ప్రోక్యూర్ మెంట్ హెడ్ ఆండ్రీస్ స్పీహ్వాబ్, జాతీయ భద్రతా సలహామండలి సభ్యులు జీ. సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమ దృష్టి ఇప్పుడు హైదరాబాద్పై వుందని అన్నారు. హైదరాబాద్ను గ్లోబల్ ఏరోస్పేస్ డ డిఫెన్స్ క్యాపిటల్గా తీర్చిదిద్దుతాం. 'మేడ్ ఇన్ తెలంగాణ' ఉత్పత్తులు ప్రపంచ ఆకాశంలో సత్తా చాటుతున్నాయి. ఏరోస్పేస్ రంగంలో తెలంగాణ ప్రపంచ స్థాయిలో తన ముద్ర వేస్తోంది . అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్ క్యాబిన్ల నుంచి ఎఫ్?16 విమానాల రెక్కల వరకు తెలంగాణలో తయారీ అవుతోంది. అపాచీ హెలికాప్టర్ విడిభాగాలు, ఏరో ఇంజిన్ కంపోనెంట్లు తెలంగాణలోనే తయారీఅవుతోంది. అమెరికా, ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, జపాన్, ఇజ్రాయెల్, కెనడా సంస్థలకు హైదరాబాద్ తొలి ఎంపిక అని అన్నారు.

తెలంగాణలో 1,500కు పైగా



ఏరోస్పేస్ ఎంఎస్‌ఎంఈలు ప్రపంచ సరఫరా గొలుసులో భాగస్వాములు. డీఆర్డీఓ, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలతో దేశంలోనే బలమైన ఏరోస్పేస్ ఎకోసిస్టమ్. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ప్రపంచ స్థాయి నైపుణ్య మానవ వనరుల తయారీ వుంది. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తోంది. తెలంగాణ ఏరోస్పేస్ రంగం ఏటా సుమారు 30% వృద్ధితో దూసుకెళ్తోంది. గత ఏడాది ఏరోస్పేస్ ఎగుమతులు 103% పెరిగి ఫార్మా ఎగుమతులను అధిగమించాయి. ప్రపంచ పెట్టుబడిదారులకు తెలంగాణ అత్యంత విశ్వసనీయ గమ్యస్థానం . పారదర్శక పాలన, వేగవంతమైన అనుమతులతో పరిశ్రమలకు సంపూర్ణ సహకారం వుంటుంది. ఏరోమార్ట్?2026తో తెలంగాణ పరిశ్రమలకు అంతర్జాతీయ మార్కెట్లలో కొత్త అవకాశాలు వుంటాయి. స్థానిక ఎంఎస్‌ఎంఈలను గ్లోబల్ సప్లై చైన్లో కీలక భాగస్వాములుగా తీర్చిదిద్దుతాం. భవిష్యత్ ప్రపంచ ఏరోస్పేస్ చరిత్రలో తెలంగాణ పేరు స్వర్ణాక్షరాలతో నిలుస్తుందని అన్నారు.

## సంపాదకీయం

బుధవారం, జులై 01, 2026

# వ్యవసాయ సంక్షోభం తప్పదా

పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల సంభవించే ఎల్ నినో ప్రస్తుత వాతావరణాన్ని పూర్తిగా శాసిస్తోంది. వర్షాల కొరత నేరుగా ఖరీఫ్ సీజన్‌పై దెబ్బకొట్టబోతోంది. తెలుగు రాష్ట్రాల్లో వరి, పత్తి, మిరప, వేరుశనగ సాగు చేసే రైతులు ఇప్పటికే విత్తనాలు వేయడానికి వెనుకంజ వేస్తున్నారు. కాలవర్షాలు కురవకపోతే పంట దిగుబడి గణనీయంగా పడిపోయి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నభిన్నమవుతుంది. దీని ప్రభావం మార్కెట్లపై పడి పప్పుధాన్యాలు, కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉంది. పాలకులకు ఇది కేవలం వాతావరణ సమస్యే కాదు, ఆర్థిక సంక్షోభానికి దారితీసే ముప్పు కూడా. జూలై, ఆగస్టు నెలల్లో కూడా ఎల్ నినో ప్రభావం తీవ్రంగానే ఉండబోతోంది. కాబట్టి, అందుబాటులో ఉన్న కొద్దిపాటి జలవనరులను అత్యంత జాగ్రత్తగా మేనేజ్ చేయడం ఒక్కటే ప్రస్తుతానికి ఉన్న మార్గం. గత ఏడాది పడాల్సిన వర్షాలు ముందే కురిసి, శ్రీశైలానికి వరుసగా మూడు, నాలుగు నెలల పాటు రికార్డు స్థాయిలో ఇన్‌ఫ్లో తెచ్చిపెట్టాయి. కానీ ఈ ఏడాది పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. నైరుతి రుతుపవనాల గమనం మందగించడంతో దేశంలోని సగానికి పైగా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోంది. వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం, ఈ సీజన్‌లో దేశవ్యాప్త సగటు వర్షపాతం లోటు భారీగా ఉండే ప్రమాదం ఉంది. ఇది దేశ ఆహార భద్రతపై నేరుగా ప్రభావం చూపనుంది. దక్షిణ భారతదేశంలో ఎల్ నినో ప్రభావం అత్యంత స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా జూన్ నాటికి నిండాల్సిన కర్ణాటక, కేరళ, తమిళనాడులోని ప్రధాన జలాశయాలు ఈసారి వెలవెలబోతున్నాయి. కావేరి, కృష్ణా బేసిన్లలో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. దక్షిణాదిలోని ప్రధాన నగరాల్లో ఇప్పటికే తాగునీటి ఎద్దడి సంకేతాలు కనిపిస్తుండగా, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన జలవనరులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వర్షాలు సకాలంలో పడకపోతే అంతర్-రాష్ట్ర జల వివాదాలు మళ్లీ రాజుకునే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు జీవనాడి అయిన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భారీగా వరద వస్తేనే ఈ డ్యామ్‌లు నిండుతాయి. అయితే ఎల్ నినో కారణంగా కృష్ణా నది ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు మొహం చాటేశాయి. గత ఏడాది తరహాలో ఈసారి జలాశయాలు నిండుతాయా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గోదావరి బేసిన్‌లోనూ ఇదే పరిస్థితి ఉండటంతో.. అటు రాయలసీమకు తాగునీరు, ఇటు కోస్తా, తెలంగాణ జిల్లాలకు సాగునీరు అందించడం ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలుగా మారనుంది. ఎల్ నినో ప్రభావం కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిసే 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ జిల్లాలు కలిగిన ఆయా రాష్ట్రాలు తమ అత్యవసర ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించింది. ఈ 315 జిల్లాల్లో 25 శాతం కంటే తక్కువ సాగునీటి వసతి కలిగిన 111 జిల్లాలను అత్యంత ప్రమాదకమైన కేటగిరీగా గుర్తించారు. 25 నుంచి 50 శాతంలోపు సాగునీటి వసతి ఉన్న మరో 76 జిల్లాలను మధ్యస్థ ప్రమాదకర కేటగిరీలో చేర్చగా, 50 శాతం కంటే ఎక్కువ సాగునీటి సౌకర్యం ఉన్న 128 జిల్లాలను సాపేక్షంగా తక్కువ ముప్పు ఉన్న ప్రాంతాలుగా పరిగణించారు. అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జిల్లాలు ఎక్కువగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో కేంద్రీకృతమై ఉన్నాయి. మిగిలిన జిల్లాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. బలహీనమైన రుతుపవనాల ప్రభావాన్ని తట్టుకునేందుకు పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల సాగువైపు రైతులను ప్రోత్సహించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. పంటల వైవిధ్యం, తేమ సంరక్షణ, సమర్థవంతమైన నీటి యాజమాన్యం వంటి వ్యూహాలను అనుసరించాలని తెలిపింది. చెరువుల మరమ్మతులు, చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణ, కాలువల్లో పూడికతీత, నీటి సంరక్షణ నిర్మాణాల విస్తరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. మరోవైపు 2026 ద్వితీయార్థంలో ఎల్ నినో తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ హెచ్చరించింది. 'సౌత్ ఏషియన్ ?క్లైమేట్ అవుట్ లుక్ ఫోరం' అంచనాల ప్రకారం భారతదేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో కేవలం 90 శాతం మాత్రమే కురిసే అవకాశం ఉంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి కారణంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎల్ నినో వల్ల అనావృష్టి ఏర్పడి ఆహార ద్రవ్యోల్బణం పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

- ఎడిటర్

# కేబినెట్ ఫైట్...శాఖల మార్పులు తప్పేవా

న్యూఢిల్లీ,జూన్ 30 (న్యూస్ పల్స్) తెలంగాణకు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు, ప్రస్తుతం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కు పదవీ గండం తొలగిపోయినట్టేనని జాతీయ మీడియా సహా.. బీజేపీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కేంద్ర మంత్రివర్గ ప్రక్షాళనకు సమయం ఆసన్నమైందని బీజేపీ సీనియర్లు చెబుతున్నారు. ఈ నెలలోనే అంటే.. కొద్ది రోజుల్లోనే ప్రక్షాళన చేయనున్నారని అంటున్నారు. అయితే ప్రస్తుతం .. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన సోమవారం నాటికి వచ్చే అవకాశం ఉంది. ఆయన రాగానే అదే రోజు లేదా ఈ నెల 30 నాటికి మంత్రి వర్గ మార్పు ఉంటుందని జాతీయ మీడియా వర్గాల్లో చర్చ సాగుతోం ది. ఇటీవలే ప్రధాని మోడీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి వర్గ ప్రక్షాళనపైనే ఆమెతో చర్చించినట్టు కూడా వార్తలు రాగా.. తాజాగా మరో విషయం వెలుగు చూసింది. మంత్రుల కూర్పుపై పలు పేర్లతో కూడిన జాబితాను కూడా రాష్ట్రపతికి ప్రధాని అందించారని జాతీయ మీడియా తెలిపింది. ఈ నేపథ్యంలో బండి సంజయ్ చోటు ఏమాత్రం చెదిరిపోదన్న వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఇటీవల బండి భగీరథ్ వ్యవహారం తెరమీదికి వచ్చిన తర్వాత.. కేంద్ర మంత్రిగా సంజయ్‌ను తప్పిస్తారన్న చర్చ సాగింది. కానీ, ఈ విషయంలో బండి ప్రమేయం లేదని.. ఆయన పార్టీకి చేసిన సేవల నేపథ్యంలోనే పదవి లభించిందన్న వాదన ఉంది. పైగా.. పార్టీకి కుటుంబ వ్యవహారాలకు కూడా సంబంధం లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ సీటు విషయంలో ఎలాంటి మార్పులు ఉండవని తెలుస్తోంది. ఇక, రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి మొత్తం ఐదుగురు మంత్రులు ఉండగా.. బండి సంజయ్‌ను అలానే కొనసాగించినా.. మిగిలిన నలుగురి విషయంలో మార్పులు ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్‌నాయుడును పర్యాటక శాఖ మంత్రిగా(ఇండిపెండెంట్ )గా పంపించే అవకాశం ఉందని గట్టిగా చెబుతున్నారు. ఇక, తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డిని పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పంపించే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం కిషన్ రెడ్డి గనుల శాఖ మంత్రిగా ఉన్నారు. అలానే.. గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విషయంలోనూ మార్పు ఉండే అవకాశం ఉందని.. ఆయనను కూడాహోం శాఖ పరిధిలోకి తీసుకుంటారని అంటున్నారు. ఇక, బీజేపీ నాయకుడు, నరసాపురం ఎంపీ శ్రీనివాస వర్మ.. ప్రస్తుతం కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. ఆయనను కూడా మార్పు చేసి.. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ సహాయ మంత్రిగా పంపించే అవకాశం ఉందని తెలుస్తోంది. మొత్తంగా ఈ మార్పులు చేర్పులు ఉండడం మినహా మంత్రులను తప్పించే అవకాశం లేదని సమాచారం. కేంద్ర మంత్రివర్గంలో ప్రక్షాళన ఖాయమనే వార్తలు వస్తున్న నేపథ్యంలో కీలకమైన ఆర్థిక శాఖ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. దాదాపు 10 సంవత్సరాలుగా ఈ శాఖకు మంత్రిగా ఉన్న నిర్మలా సీతారామన్‌ను తప్పించడం ఖాయమని ఢిల్లీ వర్గాలు సహా.. బీజేపీ పెద్దలు కూడా చూచాయగా చెబుతున్నారు. అంతేకాదు.. ఆమె స్థానంలో ఆర్‌బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌కు పగ్గాలు అప్పగిస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న సమయంలో శక్తికాంత దాస్.. చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఇది ఇప్పుడు ఆయనకు కలిసి వస్తుందని అంటున్నారు. గత 10 సంవత్సరాలకు పైగానే కేంద్ర ఆర్థిక మంత్రిగా అపర చాణిక్యురాలిగా పేరొందిన నిర్మలా సీతారామన్‌ను మార్చడానికి పలు కారణాలు ఉన్నాయని జాతీయ మీడియా పేర్కొంది. గత రెండేళ్లుగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతోపాటు.. ఆర్థిక కార్యకలాపాలపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న దరిమిలా.. త్వరలోనే జరగనున్న పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వ్యవహారం కూడా దీనికి లింకుగా ఉందని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రజల ఆగ్రహాన్ని తగ్గించేందుకు.. దేశంలో ఆర్థిక సమస్యలు తగ్గించి.. కార్యకలాపాలను గాడిలో పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని జాతీయ మీడియా పేర్కొంటోంది. డాలర్‌తో పోలిస్తే.. గత రెండేళ్లుగా రూపాయి మారకం విలువ పడిపోతోంది. అదేసమయంలో స్టాక్ మార్కెట్లలో భారీ నష్టాలు.. దేశీయంగా ఆర్థిక కార్యకలాపాలు మందగించడం.. మరోవైపు పొంచి ఉన్న ద్రవ్యోల్బణ ముప్పు వంటి వాటిని సమర్థవంతంగా నిర్మలమ్మ ఎదుర్కొనలేక పోతున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆమెను తప్పించడం ఖాయమని చెబుతున్నారు. అయితే.. పూర్తిస్థాయిలో ఆమెను మంత్రివర్గం నుంచి తప్పించకుండా.. శాఖను మాత్రమే మార్పు చేసే అవకాశం ఉందని పెద్ద ఎత్తున బీజేపీ నాయకుల మధ్య కూడా చర్చ సాగుతోంది. ఇక, శక్తికాంత దాస్ విషయానికి వస్తే.. ఆర్బీఐ గవర్నర్‌గా ఆయన కరోనా వంటి కీలక సమయంలోనూ ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసే చర్యలు చేపట్టారు. ప్రపంచ స్థాయిలో ఆర్థిక స్థితి మందగమనంలో ఉన్నప్పుడు కూడా భారత్ తనను తాను నిలబెట్టుకు నేలా ఆయన వ్యూహాత్మకంగా ముందుకు సాగారు. ఆర్థిక రిజర్వ్‌లు తగ్గిపోకుండా చూశారు. ఇవన్నీ భవిష్యత్తులో దేశాన్ని మరోసారి నిలబెట్టే అవకాశం ఉంటుందన్న చర్చ సాగుతోంది. కాగా.. ప్రస్తుతం శక్తికాంతదాస్ పార్లమెంటుకు ఏ సభ నుంచి కూడా ప్రాతినిధ్యం వహించడం లేదు. అయినప్పటికీ.. ఆయనను మంత్రిగా తీసుకుని.. తర్వాత రాజ్యసభకు ప్రమోట్ చేయించే అవకాశం ఉందని అంటున్నారు.

# కేబినెట్ లో మరో మంత్రి

హైదరాబాద్, జూన్ 30,తెలంగాణపై భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే కేంద్ర మంత్రివర్గ విస్తరణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రాష్ట్రం నుంచి కేంద్ర క్యాబినెట్‌లో మరొకరికి అవకాశం లభిస్తుందా, లేక ప్రస్తుతం ఉన్న ఇద్దరితోనే సరిపెడతారా అనే అంశంపై రాష్ట్ర బీజేపీ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఈ మార్పులు, చేర్పుల ప్రచారం నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన పలువురు బీజేపీ ఎంపీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో తమకు అనుకూలంగా సమీకరణాలను చక్కబెట్టుకునే పనిలో పడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఊహించని విధంగా ఎనిమిది స్థానాలను కైవసం చేసుకుంది కమలం పార్టీ. దీనికి అదనంగా లక్ష్మణ్ ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యునిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి కిషన్ రెడ్డి కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, బండి



సంజయ్ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక తర్వాత తెలంగాణలోనే పార్టీ అధికారంలోకి రావడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని బీజేపీ జాతీయ నాయకత్వం బలంగా విశ్వసిస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా తెలంగాణలో పాగా వేయడమే లక్ష్యంగా కేంద్ర మంత్రులు, జాతీయ నేతలు రాష్ట్రంలో నిరంతరం పర్యటిస్తున్నారు. ఈ తరుణంలో, రాష్ట్రంలోని ముఖ్య నాయకుల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను సమూలంగా పరిష్కరించి, కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి మరో మంత్రి పదవిని కేటాయించడం దోహదపడుతుందని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. తెలంగాణ నుంచి ప్రస్తుతం ఒక క్యాబినెట్, ఒక సహాయ మంత్రి పదవులు ఉండగా, రాబోయే ఎన్నికల వ్యూహంలో భాగంగా మూడో వ్యక్తికి అవకాశం కల్పించడం ద్వారా సామాజిక సమతుల్యతను సాధించాలని అధిష్ఠానం యోచిస్తోంది. మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కించుకునేందుకు పలువురు సీనియర్ నాయకులు ఎవరి ధీమాతో వారు ఉన్నారు. ప్రధానంగా ఈటల రాజేందర్, డి.కె.అరుణ, ధర్మపురి అర్వింద్, జి.నగేశ్ తదితరుల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. అయితే., ఈటల రాజేందర్, డీకే అరుణ రేసులో ముందు వరుసలో ఉన్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఇప్పటికే బీసీ సామాజిక వర్గం నుంచి బండి సంజయ్ మంత్రివర్గంలో ఉన్నప్పటికీ, బలమైన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఈటల రాజేందర్‌కు అవకాశం కల్పిస్తే రాష్ట్రంలో రాజకీయంగా పెద్ద ఎత్తున కలిసి వస్తుందని భావిస్తున్నారు. మరోవైపు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సైతం ఈసారి గట్టి ఆశలతో ఉన్నారు. ఈ విస్తరణలో మహిళలకు ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉండటం, పైగా ముఖ్యమంత్రి సొంత జిల్లా అయిన ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ గట్టి పోటీని తట్టుకుని ఆమె విజయం సాధించడంతో ఆమె పేరును అధిష్ఠానం తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే, డీకే అరుణ ప్రాతినిధ్యం వహిస్తున్న సామాజిక వర్గం నుంచే ఇప్పటికే కిషన్ రెడ్డి క్యాబినెట్ మంత్రిగా అత్యంత కీలక బాధ్యతల్లో ఉన్నారు. అలాగే శాసనసభలో పార్టీ పక్ష నేత కూడా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో, ఒకే సమీకరణం నుంచి మరో వ్యక్తిని కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఓసీ, బీసీ వర్గాలకు కేంద్రంలో చోటు దక్కినందున, గిరిజన ఓటు బ్యాంకును ఆకర్షించేందుకు ఆదిలాబాద్ ఎంపీ జి.నగేశ్‌కు అవకాశం ఇవ్వవచ్చనే ప్రచారం కూడా ఊపందుకుంది. మరోవైపు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సైతం తనదైన శైలిలో గట్టి నమ్మకంతో ప్రయత్నాలు సాగిస్తున్నారు. మొత్తంమీద, తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రస్తుతమున్న మంత్రులలో ఎటువంటి మార్పులు చేయకుండానే, అదనంగా మరొకరికి అవకాశం కల్పించే వ్యూహాన్ని అధిష్ఠానం అమలు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే, బీజేపీ జాతీయ నాయకత్వం చివరి నిమిషంలో నిర్ణయాలు మార్చడంలో ప్రసిద్ధి చెందినందున, ఈ విస్తరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఉత్కంఠ కొనసాగడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# రంగంలోకి సీఎం టీమ్....

హైదరాబాద్, జూన్ 30,తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు ముగుస్తున్న నేపథ్యంలో, రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చ నడుస్తోంది. ప్రజా పరిపాలనపై ప్రజల అసలు అభిప్రాయం ఏంటి? క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ప్రతిష్ట ఎలా ఉందనే అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఆరా తీస్తున్నారు. ఇంటెలిజెన్స్, థర్డ్ పార్టీ నివేదికలను పక్కన పెట్టి, కేవలం తన సొంత నమ్మకస్థులతో కూడిన 'సీఎం టీమ్'ను రేవంత్ రెడ్డి రంగంలోకి దించడం ఇప్పుడు పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రభుత్వ వ్యతిరేకత రాకముందే అప్రమత్తమవ్వడం, లోపాలను సరిదిద్దుకుంటూ ఎన్నికల మూడ్‌ను ఇప్పటి నుంచే సెట్ చేయడమే లక్ష్యంగా సీఎం స్వయంగా ఈ సర్వే ప్రక్రియను మానిటరింగ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రత్యేక సర్వేను సీఎం టీమ్ తొలుత మంత్రుల నియోజకవర్గాల్లో ప్రారంభించనుంది. ఆ తర్వాతే మిగతా అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారు. కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు విపక్షాల చేతిలో ఉన్న నియోజకవర్గాల్లోనూ ఈ టీమ్స్ పర్యటించనున్నాయి. ప్రభుత్వ ఆరు గ్యారెంటీలు, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి ఎంతవరకు వెళ్లాయి? స్థానిక ప్రజలకు, పార్టీ క్యాడర్‌కు మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంతవరకు అందుబాటులో ఉంటున్నారు? నియోజకవర్గాల్లో పార్టీ పట్టు ఎలా ఉంది? ఎమ్మెల్యేల గ్రాఫ్ ఎలా ఉంది? ఎక్కడెక్కడ అసంతృప్తి వ్యూహాలు నడుస్తున్నాయి? అనే విషయాలను సీఎం అత్యంత రహస్యంగా క్రోడీకరిస్తున్నారు. ఈ సర్వే ద్వారా వచ్చే డేటాను కేవలం నివేదికలకే పరిమితం చేయకుండా, ఒక పక్కా యాక్షన్ ప్లాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి సిద్ధం చేస్తున్నారు. సర్వే విశ్లేషణ ఆధారంగా పార్టీ పరంగా, ప్రభుత్వ అభివృద్ధి పరంగా వెనుకబడిన జిల్లాలను ప్రత్యేకంగా ఫిల్టర్ చేయనున్నారు. ఆయా జిల్లాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో పాటు, ఇన్-ఛార్జ్ మంత్రులను అలర్ట్ చేసి క్యాడర్‌లో నూతనోత్తేజం నింపేందుకు సీఎం కార్యాచరణ రూపొందిస్తున్నారు. మరోవైపు, ప్రజాక్షేత్రంలో పట్టు కోల్పోతున్న ప్రజాప్రతినిధులకు తమ పనితీరు మార్చుకోవాలని గట్టి హెచ్చరికలు జారీ చేసేందుకు కూడా వెనుకాడబోరని గాంధీ భవన్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం పనితీరు, నెరవేరని హామీలపై సునీల్ కనుగోలు టీమ్ ఉమ్మడి పది జిల్లాల్లో సర్వే చేసి సీఎంకు కీలక రిపోర్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నివేదికలో కొన్ని ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. కొన్ని జిల్లాల్లో బీఆర్ఎస్, మరికొన్ని జిల్లాల్లో బీజేపీ కాంగ్రెస్‌కు గట్టి ఫైట్ ఇవ్వనున్నట్లు అంచనా వేశారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్ కంటే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మెరుగ్గా ఉన్నాయని ఈ రిపోర్ట్ తేల్చినట్లు సమాచారం. దీంతో పార్టీ ఓటు బ్యాంకును కాంగ్రెస్ వైపు ఎలా మళ్లించాలనే దానిపై ప్రభుత్వ పెద్దలు కసరత్తులు ప్రారంభించారు. బీజేపీ ఓటు బ్యాంకు బీఆర్ఎస్‌కు, బీఆర్ఎస్ ఓటు బ్యాంకు బీజేపీకి షిఫ్ట్ కాకుండా ఉంటేనే కాంగ్రెస్‌కు పూర్తి లాభం జరుగుతుందని సునీల్ టీం సూచించినట్లు సమాచారం.

# కేబినెట్ విస్తరణకు బ్రేక్....

హైదరాబాద్, జూన్ 30,తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలంగా హాట్ టాపిక్‌గా నడుస్తున్న మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియకు ప్రస్తుతానికైతే బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. ఢిల్లీ వేదికగా ఏఐసీసీ అగ్రనాయకత్వం, ఇటు రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని సమీక్షలు జరిపినప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఉన్న సంక్లిష్ట రాజకీయ సమీకరణాలు ఈ ప్రక్రియకు గట్టిగా మోకాలడ్డుతున్నాయి. ఉన్న సమస్యలకు తోడు కొత్త సమస్యలను కొనితెచ్చుకోవడం ఇష్టం లేక, కాంగ్రెస్ హైకమాండ్ ఈ కేబినెట్ విస్తరణ అంశాన్ని ప్రస్తుతానికి పూర్తిగా పక్కన పెట్టేసినట్లు తెలుస్తోంది. తెలంగాణ కాంగ్రెస్‌లో పైకి అంతా సజావుగానే ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ.. అంతర్గతంగా నడుస్తున్న వర్గ పోరాటం ఊహించిన దానికంటే చాలా ఎక్కువగా ఉందనేది నగ్నసత్యం. ముఖ్యంగా, రాహుల్ గాంధీకి అత్యంత నమ్మకస్తురాలైన ఏఐసీసీ సీనియర్ నేత మీనాక్షి నటరాజన్ వ్యవహారం ఇప్పుడు పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మధ్యప్రదేశ్‌లో ఆమె రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడంలో తెలంగాణకు చెందిన ఒక వర్గం నేతల పాత్ర ఉందన్న అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. అధిష్టానానికి అత్యంత సన్నిహితురాలైన నేతకే రాష్ట్రంలోని సొంత పార్టీ వర్గం నుండి సరైన మద్దతు లభించలేదనే టాక్ రాహుల్ గాంధీని తీవ్ర అసంతృప్తికి గురిచేసినట్లు సమాచారం. ఈ ఒక్క ఘటనతో తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ల మధ్య ఉన్న విభేదాలు ఏ స్థాయికి చేరాయో హైకమాండ్‌కు స్పష్టమైన అవగాహన వచ్చింది. నిజానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ పెద్దలు కలిసి తెలంగాణ కేబినెట్‌లో భారీ మార్పులు చేయాలని ఒక పక్కా ప్లాన్ సిద్ధం చేశారు. సరిగా పనిచేయని మంత్రులను కేబినెట్ నుండి తొలగించాలని,

సామాజిక, ప్రాంతీయ సమీకరణాల ఆధారంగా కొత్తవారికి అవకాశం కల్పించాలని భావించారు. అసంతృప్త సీనియర్లను ప్రసన్నం చేసుకోవడానికి కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవులను సర్దాలని నిర్ణయించారు. కానీ, మీనాక్షి నటరాజన్ ఎపిసోడ్ రేపిన సెగలతో సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఈ తరుణంలో మంత్రివర్గంలో చెయ్యి పెడితే, పదవులు దక్కని అసంతృప్త నేతలు తిరుగుబాటు జెండా ఎగురవేసే ప్రమాదం ఉందని అధిష్టానం గ్రహించింది. అది కాస్తా ప్రభుత్వ స్థిరత్వానికే ఎసరు తెచ్చే అవకాశం ఉందన్న విశ్లేషణలతో పాత ప్లాన్‌ను పూర్తిగా పక్కన పెట్టేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవైపు పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటూనే, మరోవైపు పరిపాలనను ముందుకు తీసుకెళ్లాల్సిన కత్తిమీద సాము లాంటి పరిస్థితిని సీఎం రేవంత్ రెడ్డి ఎదుర్కొంటున్నారు. కేబినెట్ విస్తరణ చేపడితే.. ఆశావహుల సంఖ్య ఇక్కడ డజన్లలో ఉంది. ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల నుండి సీనియర్లు, అలాగే ఇతర పార్టీల నుండి వలస వచ్చిన నేతలు మంత్రి పదవుల కోసం తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఈ తరుణంలో ఎవరికి ఇచ్చినా మరొకరు అసంతృప్తికి గురికావడం ఖాయం. అందుకే రేవంత్ రెడ్డి కూడా ఈ వివాదాన్ని తలకెత్తుకోవడం కంటే, "ఉన్న ముఠా తగాదాలను మరింత రచ్చ చేయకుండా యథాతథ స్థితిని కొనసాగించడమే శ్రేయస్కరం" అనే ముగింపునకు వచ్చినట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. మరింత సరైన సమయం వచ్చే వరకు వేచి చూడడమే రాజనీతి అని ఆయన భావిస్తున్నారు. తెలంగాణలో త్వరలోనే మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ జరుగుతుందనే ప్రచారానికి ప్రస్తుతానికైతే బ్రేక్ పడినట్లే. ఒకవేళ అత్యవసరమై ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాల్సి వచ్చినా.. అది కేవలం నామమాత్రపు విస్తరణగానే ఉంటుంది తప్ప, ఎవరినీ మార్చే లేదా తొలగించే సాహసం హైకమాండ్ చేయకపోవచ్చు

# బుల్లెట్ ట్రైన్ సర్వే షురూ..

హైదరాబాద్, జూన్ 30, (న్యూస్ పల్స్) కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు బుల్లెట్ రైలు కారిడార్ల ప్రాజెక్టులో కీలక అడుగు పడింది. నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ పర్యవేక్షణలో తెలంగాణలోని రంగారెడ్డి, నల్గొండ, వికారాబాద్ జిల్లాల పరిధిలో క్షేత్రస్థాయి (గ్రౌండ్) సర్వే ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఈ కారిడార్ల మార్గాన్ని ఖరారు చేసేందుకు సర్వే బృందాలు క్లిష్టమైన కసరత్తును నిర్వహిస్తున్నాయి. ఈ సర్వేలో భాగంగా రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని కురుమిద్ద, మేడిపల్లి, మంకీస్‌గూడెం, చింతపట్ల వంటి పలు గ్రామాల్లోని పొలాలు, ఖాళీ స్థలాలలో ఎరుపు, తెలుపు రంగులతో ప్రత్యేక మార్కింగ్‌ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. హైదరాబాద్–చెన్నై కారిడార్ శంషాబాద్, యాచారం మీదుగా నల్గొండ జిల్లా నాంపల్లి వైపు, అలాగే హైదరాబాద్–బెంగళూరు కారిడార్ శంషాబాద్, షాబాద్ మండలాల మీదుగా సాగేలా ప్రాథమిక ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే ఈ హైస్పీడ్ రైలు మార్గాలకు సంబంధించి ఏరియల్ సర్వే విజయవంతంగా ముగిసింది. అలాగే హైదరాబాద్–బెంగళూరు కారిడార్ శంషాబాద్, షాబాద్ మండలాల మీదుగా సాగేలా ప్రాథమిక ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే ఈ హైస్పీడ్ రైలు మార్గాలకు సంబంధించి ఏరియల్ సర్వే విజయవంతంగా ముగిసింది. ప్రస్తుతం జరుగుతున్న క్షేత్రస్థాయి గ్రౌండ్ సర్వే పూర్తిగా పూర్తయితే, ప్రాజెక్టుకు సంబంధించిన తుది ఎలైన్‌మెంట్, బుల్లెట్ రైలు స్టేషన్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే లొకేషన్లు, భవిష్యత్తులో అవసరమయ్యే భూసేకరణ పరిధిపై పూర్తి స్పష్టత రానుంది. ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు నగరాలకు ప్రయాణ సమయం కేవలం 2 నుండి 3 గంటలకు తగ్గిపోనుంది.

# వారణాసి..ఇక ఓన్లీ వెజ్

లక్నో, జూన్ 30, (న్యూస్ పల్స్)ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి నగరం త్వరలో శాకాహార నగరంగా మారనుంది. వారణాసి నగర మున్సిపల్ కార్పొరేషన్(వీఎంసీ) తన పరిధిలోని మాంసం, చేపలు, కోళ్ల దుకాణాలను నగర శివార్లకు తరలించాలని నిర్ణయించింది. ఈ మేరకు మేయర్ అశోక్ తివారీ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. దీంతో నగర పరిధిలో ఉన్న 350 నుంచి 400 మాంసం దుకాణాలను రాబోయే ఆరు నెలల్లో దీపావళిలోపు విడతల వారీగా నగర శివార్లకు తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ దుకాణాలను రామ్నగర్, సుజాబాద్, గణేశ్‌పూర్, అవలేష్ నగర్, శివపూర్ ప్రాంతాలకు తరలించనున్నారు. దీంతో కాశీనగరం దేశంలోని రెండవ శాకాహార నగరంగా మారనుంది. ప్రస్తుతం ప్రపంచంలోని ఏకైక పూర్తి శాకాహార పట్టణంగా గుజరాత్ రాష్ట్రంలోని 'పాలితానా' గుర్తింపు పొందింది. ఇక్కడ 2014 నుంచి మాసం, చేపలు, గుడ్లు విక్రయాలపై నిషేధం అమల్లోఉంది. వారణాసిలో హిందువులు 72శాతం, ముస్లింలు 27శాతం ఉన్నారనేఅంచనాలున్నాయి. తాజా నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నగర పరిశుభ్రత, పుణ్యక్షేత్రం ప్రత్యేకత దృష్ట్యా స్వాగతిస్తుండగా.. మరికొందరు దుకాణాలు దూర ప్రాంతాలకు మారితే వినియోగదారులకు, వ్యాపారులకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం మాంసాహారాన్ని నిషేధించడం కాదని.. కేవలం దుకాణాలను వేరే ప్రాంతానికి తరలించి.. అక్కడ వ్యాపారాలు చేసుకునేలా అవకాశాలు కల్పిస్తున్నామని చెబుతున్నారు.

# గ్రేటర్ లో గులాబీ రివర్స్ స్కెచ్

హైదరాబాద్, జూన్ 30 ,గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ –జీహెచ్ఎంసీ పరిధిలో ఎలాగైనా సరే మళ్లీ పాగా వేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ గట్టిగా ట్రై చేస్తోంది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సరికొత్త వ్యూహాలతో దూసుకుపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత దాదాపు రెండేళ్లపాటు పెద్దగా జనంలోకి రాని గులాబీ శ్రేణులు.. ఇప్పుడు మాత్రం రూట్ మార్చాయి. రోజువారీగా ప్రజల్లో ఉంటూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగారు. గ్రేటర్ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ, నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ కేడర్‌లో కొత్త జోష్ నింపుతున్నారు. బీఆర్ఎస్ అగ్రనాయకత్వం జీహెచ్ఎంసీపై ఇంతలా ప్రత్యేక దృష్టి పెట్టడం వెనుక బలమైన రాజకీయ లెక్కలు ఉన్నాయి. హైదరాబాద్ మహానగర పరిధిలోనే ఏకంగా 24 అసెంబ్లీ నియోజకవర్గాలు విస్తరించి ఉన్నాయి. దీనికి ఆనుకుని ఉన్న శివారు నియోజకవర్గాలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య దాదాపు 35 కి చేరుకుంటుంది. అంటే, రాష్ట్ర అధికార పీఠాన్ని శాసించడంలో దాదాపు మూడో వంతు బలం ఒక్క గ్రేటర్ పరిధిలోనే దాగి ఉందన్నమాట. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచినా, హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లో మాత్రం బీఆర్ఎస్ తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించింది. అదే ఊపును రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లోనూ కొనసాగించి, ఇక్కడ అధికార కాంగ్రెస్ పార్టీని గనుక మట్టికరిపించగలిగితే.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం నల్లేరుపై నడకే అని బీఆర్ఎస్ గట్టిగా భావిస్తోంది. ఇక్కడ సాధించే విజయం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి గట్టి పునాది వేయవచ్చనేది కేటీఆర్ మాస్టర్ ప్లాన్‌గా కనిపిస్తోంది. గత కొన్ని రోజులుగా కేటీఆర్ హైదరాబాద్‌లోని దాదాపు అన్ని నియోజకవర్గాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. కేవలం పార్టీ కార్యాలయాలకే పరిమితం కాకుండా, నేరుగా నియోజకవర్గాల వారీగా పర్యటిస్తూ స్థానిక లీడర్లతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ.. ఎన్నికల సమరానికి క్యాడర్‌ను సమాయత్తం చేస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గ స్థాయి సమీక్షల్లో అటు స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూనే, ఇటు రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన ూఎఖీపై పార్టీ శ్రేణులకు, ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను జనంలోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కొంతకాలం స్తబ్దుగా ఉన్న బీఆర్ఎస్ క్యాడర్.. కేటీఆర్ దూకుడుతో ఇప్పుడు రూట్ మార్చింది. దాదాపు రెండేళ్ల గ్యాప్ తర్వాత ఇప్పుడు రోజూ జనంలో ఉండేందుకే స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రాధాన్యత ఇస్తున్నారు. గల్లీ గల్లీలో పర్యటిస్తూ, ప్రజా సమస్యలపై గళమెత్తుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి కేవలం కేసీఆర్ హయాంలోనే సాధ్యమైందనే విషయాన్ని, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో నగరం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తానికి హైదరాబాద్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వానికి చుక్కలు చూపించేందుకు కేటీఆర్ సిద్ధమయ్యారు. ఒకవైపు 24 నియోజకవర్గాల అండ, మరోవైపు కేటీఆర్ దూకుడుతో గ్రేటర్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

# మైలేజ్ కోసం కవిత ఆరాటం...

హైదరాబాద్, జూన్ 30 ,తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు ఊపందుకుంటున్నాయి. బీఆర్ఎస్ నుంచి బహిష్కరణకు గురైన తర్వాత, కల్వకుంట్ల కవిత తెలంగాణ రక్షణ సేన పేరిట సరికొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. అయితే, పార్టీని ప్రకటించినప్పటికీ ఆశించిన స్థాయిలో ప్రజాదరణ లభించకపోవడం, క్యాడర్ ఆశించిన మేర యాక్టివ్ కాకపోవడంతో కవిత తన రాజకీయ వ్యూహాన్ని మార్చినట్లు కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఆమె టార్గెట్ చేయడం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఏదైనా కొత్త పార్టీ ప్రాంతీయంగా నిలదొక్కుకోవాలంటే బలమైన లీడ్ లేదా సంచలనాల అవసరం ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్యే ప్రధాన రాజకీయం నడుస్తోంది. ఈ తరుణంలో తన ఉనికిని చాటుకోవడానికి,



నిరంతరం వార్తల్లో నిలిచేందుకు కవిత సరికొత్త పంథాను ఎంచుకున్నట్లు అర్థమవుతోంది. అందులో భాగమే పవన్ కల్యాణ్ లక్ష్యంగా సాగుతున్న విమర్శలు. పవన్ కల్యాణ్ కేవలం ఒక రాజకీయ నాయకుడే కాదు, తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన మాస్ ఫాలోయింగ్ ఉన్న స్టార్ హీరో. ఆయన్ను విమర్శిస్తే సహజంగానే అటు అభిమానులు, ఇటు జనసైనికులు సోషల్ మీడియా వేదికగానో, క్షేత్రస్థాయిలోనో గట్టిగా కౌంటర్ ఇస్తారు. ఈ వివాదం ద్వారా తన కొత్త పార్టీ 'టీఆర్ఎస్' పేరు జనంలోకి వెళ్తుందనేది కవిత ఆలోచనగా రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొద్ది రోజులుగా పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి కవిత చేస్తున్న వ్యాఖ్యలు ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. పవన్ కల్యాణ్ తెలంగాణలో రాజకీయాలు చేయాలని చూస్తే ఊరుకునేది లేదని, ఇక్కడికి వస్తే తరిమికొడతామని కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన సినిమాలు చూసి ఆనందిస్తాం కానీ, రాజకీయంగా ఇక్కడ జోక్యం చేసుకుంటే సహించబోమంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తాజాగా ఇడుపు కాయితం సినిమా చుట్టూ జరుగుతున్న వివాదంలోకి కూడా పవన్ కల్యాణ్‌ను అనవసరంగా లాగడం చర్చనీయాంశమైంది. ఆ సినిమా వివాదం వెనుక ఉన్న అర్థం, పరమార్థం పవన్ కల్యాణ్‌కు బాగా తెలుసంటూ కవిత చేసిన కామెంట్స్, ఆమె కావాలనే వివాదాన్ని పెద్దది చేయాలని చూస్తున్నారనే వాదనకు తావిస్తోంది. రాజకీయాల్లో నెగెటివ్ పబ్లిసిటీ అయినా ఒక్కోసారి మైలేజ్ ఇస్తుందనేది కొందరి నమ్మకం. పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేయడం ద్వారా కవితకు వచ్చే లాభనష్టాలపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. పవన్ అభిమానులు ఇచ్చే కౌంటర్ల వల్ల మీడియాలో, సోషల్ మీడియాలో కవిత పేరు, ఆమె కొత్త పార్టీ పేరు మార్మోగుతుంది. తద్వారా తక్కువ సమయంలోనే ఎక్కువ మందికి పార్టీ రీచ్ అవుతుంది. అయితే వ్యక్తిగత విమర్శలు, పొరుగు రాష్ట్ర నాయకుడిని టార్గెట్ చేయడం వల్ల ప్రజల్లో సీరియస్‌నెస్ తగ్గే ప్రమాదం ఉంది. తెలంగాణ సెంటిమెంట్‌ను రగిల్చే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, పవన్ కల్యాణ్‌కు తెలంగాణలోనూ పెద్ద సంఖ్యలో అభిమానులు ఉండటం కవితకు మైనస్ కావచ్చు. మొత్తానికి, 'తెలంగాణ రక్షణ సేన'కు ఆశించినంత స్పందన రాకపోవడంతో, పవన్ కల్యాణ్ లాంటి పాపులర్ లీడర్‌ను ఢీకొట్టడం ద్వారా పొలిటికల్ మైలేజ్ సాధించాలనే కవిత వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. మరి ఈ పవన్ కల్యాణ్ అస్త్రం కవిత కొత్త పార్టీకి ఎంతవరకు ఊపిరి పోస్తుందో, ఎలాంటి రాజకీయ లబ్ధిని చేకూరుస్తుందో వేచి చూడాలి.

# షాద్‌నగర్ లో చారిత్రక ఫిరంగులు మాయం..!

**చారిత్రక ఫిరంగుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి**

**షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు**

**షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో మూలకు పడేసిన ఫిరంగి రూ. 2లక్షలతో మున్సిపల్ ఎదుట నిర్మాణం చేసి పెయింటింగ్ వేసేందుకు నిధులు మంజూరు నిధులు ఏమయ్యాయి**


**- ఫిరంగి మూలకు ఎందుకు పడింది..?**

**ఫిరంగుల మాయంపై పోలీసులకు ఫిర్యాదు..**

షాద్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనుక ప్రహరీ గోడ సమీపంలో ఉన్న చారిత్రక ఫిరంగుల నిర్లక్ష్య స్థితిపై రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. తాజాగా ఆ ప్రాంతాన్ని సందర్శించిన బక్కని నర్సింహులు, ఫిరంగి పూర్తిగా దుమ్ము, ధూళితో కప్పబడి ఉండటాన్ని గమనించి స్వయంగా కొంత భాగాన్ని శుభ్రం చేశారు. గతంలో అక్కడ రెండు ఫిరంగులు ఉండేవని, ప్రస్తుతం ఒకటి మాత్రమే కనిపిస్తోందని, మరొకటి కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఈ చారిత్రక ఆయుధాలు గతంలో రాజుల నివాసంగా ఉన్న ప్రాంతంలో ఉండేవని, ప్రస్తుతం ఆ ప్రాంతం రైతు కాలనిగా ప్రసిద్ధి చెందిందని ఆయన వివరించారు. చారిత్రక వారసత్వానికి గుర్తుగా ఉన్న ఈ ఫిరంగులను సంరక్షించి, భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బక్కని నర్సింహులు కోరారు. ఈ మేరకు ఫిరంగిల మాయంపై షాద్‌నగర్ సహాయ పోలీసు కమిషనర్‌కు సమాచారం అందించినట్లు ఆయన తెలిపారు.

# యూరప్ మండిపోతోంది.. వడగాల్పులకు పది రోజుల్లో 1300 మంది మృతి

యూరప్ ఎండలతో అట్టుడికిపోతోంది. అక్కడ సగటు ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ పైనే నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు వడగాలులు, ఉక్కపోత, వడదెబ్బలతో అల్లాడుతున్నారు. తీవ్రమైన ఎండలు, వడగాలుల కారణంగా యూరప్‌లో 1,300 మందికిపైగా మరణించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా. ఎండల కారణంగా సాధారణ జనజీవితం స్తంభించిపోయింది. ప్రజలు ఇండ్లల్లోంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. ఎండ ప్రభావానికి గురైన వారికి అత్యవసర సేవలు అందించేందుకు అక్కడి సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. డిమాండ్‌కు తగ్గట్లుగా సేవలు అందించలేకపోతున్నారు. వృద్ధులు, పిల్లలు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు అధికంగా ఇబ్బందులు పడుతున్నారు. యూరప్‌లోని అనేక దేశాలు ఎండ, వడగాల్పుల ప్రభావానికి గురవుతున్నాయి. జర్మనీలో అత్యధికంగా గత ఆదివారం 41.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఫ్రాన్స్‌లో 43.3 డిగ్రీలు, బ్రిటన్‌లో 38.8 డిగ్రీల ఎండ నమోదైంది. 1950 తర్వాత ఈ రేంజ్‌లో ఎండలు పెరగడం ఇదే మొదటిసారి. సగటున యూరప్‌లో వేసవిలో 20–27డిగ్రీల ఉష్ణోగ్రతలు మాత్రమే నమోదవుతుంటాయి. అలాంటిది 40 డిగ్రీలకు పైగా టెంపరేచర్ పెరగడంతో స్థానికులు తట్టుకోలేకపోతున్నారు. మరోవైపు రాత్రిపూట ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలకుపైనే నమోదవుతున్నాయి. దీంతో పగలూ, రాత్రి అనే తేడా లేకుండా ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలతో పోలిస్తే యూరప్ ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయని నిపుణులు అంటున్నారు. గత పది రోజుల్లోనే యూరప్ వ్యాప్తంగా 1300 మందికిపైగా ఎండల కారణంగా మరణించారు. వీరిలో పిల్లలు, యువత, వృద్ధులు, మహిళలు కూడా ఉన్నారు. ఫ్రాన్స్, జర్మనీ, బెర్లిన్ వంటి దేశాలు అధికంగా ఎండ ప్రభావానికి గురవుతున్నాయి. వడదెబ్బ బాధితులతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. కొన్నిచోట్ల వారికి తగిన వైద్యం అందించలేనంతగా ఆస్పత్రుల్లో డిమాండ్ పెరిగిపోయింది. 2022 నుంచి అక్కడ ఎండలు బాగా పెరిగిపోతున్నాయి. ఈ ఐదేళ్లో ఎండల కారణంగా అక్కడ 60,000 మంది మరణించారు. యూరప్ శీతల ఖండం. అందువల్ల అక్కడి ఇండ్లు, ఇతర నిర్మాణాలు వెచ్చగా ఉండేందుకు డిజైన్ చేశారు. దీంతో ఇంట్లోని వారు కూడా త్వరగా ఎండ ప్రభావానికి గురవుతున్నారు.




# బెంగాల్ ఫార్ములా పనిచేస్తుందా...

హైదరాబాద్, జూన్ 30,తెలంగాణలో విజయమే లక్ష్యంగా పనిచేయాలని.. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ దిశానిర్దేశం చేశారు. దీనికిగాను ఈ ఏడాది జరిగిన పశ్చిమ బెంగాల్ ఎన్నికలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అక్కడ ప్రజా పోరాటాల ద్వారానే అధికారం దక్కించుకున్నామని నాయకులకు చెప్పారు. ఇదే తరహాలో తెలంగాణలో కూడా విజయం దక్కించుకోవాలన్నారు. అయితే.. తెలంగాణలో బెంగాల్ ఫార్ములా పనిచేస్తుందా? అనేది కీలక ప్రశ్న. రాష్ట్ర విభజన అనంతరం.. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన పలు ప్రాజెక్టులు, నిధులు ఇప్పటి వరకు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన జరిగింది యూపీఏ(కాంగ్రెస్) హయాంలోనే అయినా.. ఆతర్వాత..వరుసగా ఇప్పటివరకు 12సంవత్సరాలుగా బీజేపీనే అధికారంలో ఉంది. అలాంటప్పుడు.. రాష్ట్రాన్ని ఇచ్చామన్న క్రెడిట్‌లో తమకు భాగం ఉందని చెబుతున్నా.. విభజన చట్టంలో పేర్కొన్న మేరకు తెలంగాణకు ఏమేరకు సాయం అందించారన్నది ప్రశ్న. ముఖ్యంగా బెంగాల్‌కు, తెలంగాణకు మధ్య పోలిక లేదు. అక్కడ క్షేత్రస్థాయిలో కమ్యూనిస్టులు పట్టుకోల్పోవడం, నిన్నటి వరకు అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీపై అవినీతి, అక్రమాల ముద్ర పడడం.. మమతా బెనర్జీ తర్వాత.. ఎవరు? అనే ప్రశ్నకు కుటుంబ పరంగా నాయకులు ముందుకు వచ్చిన దరిమిలా.. ప్రజలు వారిని తిరస్కరించడం అనేది బీజేపీకి కలిసి వచ్చింది. అదేసమయంలో బీజేపీకి.. సువేందు అధికారం ఐకాన్ నాయకుడిగా ఉన్నారు. ఇవన్నీ కలిసి వచ్చి.. బీజేపీ పాగా వేసిందనే అభిప్రాయం ఉంది. కానీ, తెలంగాణ విషయానికి వస్తే.. ప్రస్తుత అధికార పార్టీపై అవినీతి, అక్రమాల ముద్ర పడలేదు. క్షేత్రస్థాయిలో అధికారులపై మాత్రమే ఆరోపణలు వస్తున్నాయి. వీటిని సరిచేసుకునే ప్రయత్నాలు కూడా చేస్తున్నారు. ఇక, బీజేపీలో బెంగాల్ తరహా ఐకాన్ నాయకుడు తెలంగాణలో లేకపోవడంతోపాటు.. పార్టీలో ఆధిపత్య, అంతర్గత కుమ్ములాటలు ఎక్కువగా జరుగుతున్నాయి. మరోవైపు.. ఓడిపోయినప్పటికీ.. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో పట్టు సడలలేదు. మరోవైపు.. కవిత వంటి నాయకురాళ్లు దండిగా ఉన్న నేపథ్యంలో బెంగాల్ తరహా రాజకీయాలు తెలంగాణలో చేయడం సాధ్యం కాదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఇక, కీలకమైన మరో విషయం.. సీఎం రేవంత్ రెడ్డిపై బలమైన యువ నేతగా, మంచి గళం ఉన్న నాయకుడిగా కూడా గుర్తింపు ఉంది. సో.. ఇవన్నీ.. ఉండగా బెంగాల్ ఫార్ములాను నమ్ముకోవడం అన్నది తెలంగాణ బీజేపీకి సాధ్యం కాకపోవచ్చని అంటున్నారు.

# వరంగల్ కొత్త మాస్టర్ ప్లాన్

వరంగల్, జూన్ 30,గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో రాబోయే కొత్త మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ ప్రతిపాదనలపై స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇన్వెస్టర్లలో ప్రస్తుతం తీవ్ర చర్చ నడుస్తోంది. నగరాభివృద్ధి సంస్థ కుడా ప్రతిపాదిస్తున్న నూతన మాస్టర్ ప్లాన్ మార్పుల తాలూకు లీకేజీలు, ఊహాగానాలు మార్కెట్ వర్గాల్లో ఒక రకమైన ఉత్కంఠను రేపుతున్నాయి. ప్రభుత్వం అధికారికంగా తుది ప్లాన్‌ను ప్రకటించక ముందే వేర్వేరు జోన్లపై వస్తున్న లీకేజీల వల్ల రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతానికి వేచి చూసే ధోరణిని అవలంబిస్తోంది. ఈ తాజా పరిణామాలతో గ్రేటర్ వరంగల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్ల కొనుగోళ్లు తాత్కాలికంగా మందగించాయి. వ్యవసాయ జోన్ ఎటు మారుతుంది? గ్రీన్ జోన్, కమర్షియల్, రెసిడెన్షియల్ జోన్ల సరిహద్దులు ఎక్కడ ఖరారవుతాయి? అనే విషయాలపై స్పష్టత లేకపోవడంతో కొనుగోలుదారులు వెనకడుగు వేస్తున్నారు. ఏ ఒక్క జోన్ తారుమారైనా తాము పెట్టే లక్షల రూపాయల పెట్టుబడి చిక్కుల్లో పడుతుందనే అయోమయంతో ఇన్వెస్టర్లు, అటు నాలా కన్వర్షన్ అనుమతుల కోసం ఎదురుచూస్తున్న రియల్టర్లు తమ కొత్త వెంచర్ల లాంచింగ్‌లను కొద్దిరోజుల పాటు హోల్డ్‌లో పెట్టారు. ఔటర్ పరిసరాల్లో ఈ విధమైన నిస్తేజం కనిపిస్తున్నప్పటికీ, వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఏరియాల్లో మాత్రం స్థిరాస్తి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. నగర నడిబొడ్డున , ఐఆర్ఆర్ కనెక్టివిటీ ఉన్న ప్రధాన లేఅవుట్లలో ఎలాంటి జోనింగ్ భయాలు లేకపోవడంతో గజం ధరలు యథాతథంగా ఉన్నాయి. పైగా, భవిష్యత్తులో మాస్టర్ ప్లాన్ అమలులోకి వస్తే నగర కేంద్రంలో కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ మరింత పెరుగుతుందనే అంచనాతో ఇన్నర్ ఏరియాల్లో ఉన్న బిట్లను దక్కించుకోవడానికి కొందరు మదుపరులు ఇప్పటికీ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ గందరగోళానికి తెరపడాలంటే ప్రభుత్వం త్వరితగతిన కొత్త మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్‌ను అధికారికంగా విడుదల చేసి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని స్థానిక రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు. ప్లాన్‌పై పూర్తి స్థాయి పారదర్శకత వస్తేనే గ్రేటర్ వరంగల్ పరిధిలో మళ్లీ ప్లాట్ల క్రయవిక్రయాలు ఊపందుకుంటాయని, అక్రమ లేఅవుట్లకు అడ్డుకట్ట పడి మార్కెట్‌లో నమ్మకం పెరుగుతుందని వ్యాపారులు అంటున్నారు.

# హెచ్‌సీయూలో నిరవధిక సమ్మెకు దిగిన కాంట్రాక్ట్ కార్మికులు...

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (జనీఊ) లో కాంట్రాక్ట్ కార్మికులు మరోసారి ఉద్యమబాట పట్టారు. తమ దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించాలని, కార్మిక హక్కుల కాలరాటోను అరికట్టాలని డిమాండ్ చేస్తూ వర్సిటీ పరిపాలనా విభాగం ఎదుట కార్మికులు నిరవధిక నిరసనను ప్రారంభించారు. హక్కులను కాలరాస్తున్న కొత్త కార్మిక చట్టాలు..కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త కార్మిక చట్టాల (ఒజీఎనీబీతీ అనీటవబ) వల్ల తాము తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయామని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టాల అమలుతో తమ ఉద్యోగ భద్రత కరువైందని, కార్యాలయంలో రక్షణలు బలహీనపడ్డాయని వారు ఆరోపిస్తున్నారు. దశాబ్దాలుగా తాము పోరాడి సాధించుకున్న ప్రాథమిక కార్మిక హక్కులను సైతం ఈ కొత్త చట్టాల సాకుతో అణచివేస్తున్నారని కార్మికులు మండిపడుతున్నారు. కొత్త కాంట్రాక్టర్ తీరుపై ఆగ్రహం..ఇటీవలే వర్సిటీకి వచ్చిన కొత్త కాంట్రాక్టర్ నియామకంతో పరిస్థితి మరింత జటిలంగా మారిందని కార్మిక సంఘాలు పేర్కొన్నాయి..కొత్త కాంట్రాక్టర్ ఈ కార్మిక చట్టాల నిబంధనలను ఆసరాగా చేసుకుని, మాకున్న పాత హక్కులను, ప్రయోజనాలను పూర్తిగా రద్దు చేశారు. దీనివల్ల పని ప్రదేశంలో పని ఒత్తిడి పెరగడమే కాకుండా, మా జీవనోపాధికి తీవ్ర ముప్పు వాటిల్లింది." అని ఒక కార్మిక ప్రతినిధి ఆరోపించారు. డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి తగ్గేదే లేదువర్సిటీ యాజమాన్యం తక్షణమే స్పందించి, తమతో చర్చలు జరపాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. తమకు న్యాయమైన, గౌరవప్రదమైన పని వాతావరణాన్ని కల్పించే వరకు మరియు తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే వరకు ఈ నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ నిరసనల నేపథ్యంలో యూనివర్సిటీలో ఎలాంటి పరిస్థితులు నెలకొంటాయో, పరిపాలనా విభాగం దీనిపై ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# నిర్జీవ కేంద్రంగా ఆదర్శ నర్సరీ

### వెలవెలబోతున్న గరిమెళ్లపాడు హెచ్ఎన్‌టీసీ
### ఒకప్పుడు 30 లక్షల మొక్కల పెంపకం
### 300 మంది కూలీలకు ఉపాధి
### నేడు ఉనికే కనుమరుగయ్యే పరిస్థితి

చుంచుపల్లి, జూన్ 30 : ఒకప్పుడు రాష్ట్ర ఉద్యాన వన శాఖకు ఆదర్శంగా నిలిచిన చుంచుపల్లి మండలంలోని ప్రశాంతినగర్ పంచాయతీలో గల గరిమెళ్లపాడు హెచ్ఎన్‌టీసీ (హార్టికల్చర్ నర్సరీ ట్రైనింగ్ సెంటర్) నేడు తన ఉనికినే కోల్పోయే పరిస్థితికి చేరుకుంది. ఒకప్పుడు వేలాది మందికి ఉపయోగపడిన ఈ నర్సరీ ఇప్పుడు ఎందుకు నిర్జీవంగా మారింది? కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తి ఇలా నిర్లక్ష్యానికి గురికావడానికి కారణం ఎవరు? అనే ప్రశ్నలు స్థానిక ప్రజల నుండి ఉత్పన్నమౌతున్నాయి.సుమారు 72 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ నర్సరీ ఒకప్పుడు ఏటా దాదాపు 30 లక్షల మొక్కలను ఉత్పత్తి చేసి రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీలు, ప్రభుత్వ శాఖలు, ఇతర సంస్థలకు సరఫరా చేసేది. మొక్కల విక్రయాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు, పర్యావరణ పరిరక్షణలోనూ కీలక పాత్ర పోషించింది. అయితే ప్రస్తుతం ఇక్కడ మొక్కల ఉత్పత్తి దాదాపు నిలిచిపోయింది. నర్సరీ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఒకప్పుడు పచ్చదనంతో కళకళలాడిన ప్రాంతం ఇప్పుడు వెలవెలబోతుంది.మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకం, పండ్ల మొక్కలు, అటవీ మొక్కలు, అలంకరణ మొక్కల తయారీతో ఈ కేంద్రం ప్రత్యేక గుర్తింపు పొందింది. రైతులకు ఉద్యాన పంటలపై శిక్షణలు, విద్యార్థులకు ప్రకృతి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో గరిమెళ్లపాడు విద్యా, వ్యవసాయ రంగాల్లో ఆదర్శ కేంద్రంగా నిలిచింది. అత్యంత ఆందోళనకర విషయం ఏమిటంటే ఈ నర్సరీపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 300 మంది స్థానిక కూలీలు ఉపాధిని కోల్పోయారు. గతంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా ఏడాది పొడవునా పని లభించేది. ప్రస్తుతం పనులు లేక కుటుంబాల జీవనోపాధి దెబ్బతిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో ఉన్నతాధికారులు ఈ కేంద్రాన్ని సందర్శించి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని ప్రకటించినప్పటికీ, ఆ హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి. సందర్శనలు, సమీక్షలు జరిగాయి కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదు. గరిమెళ్లపాడును తిరిగి అభివృద్ధి చేస్తే ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.




# 'విద్యార్థులను పట్టించుకోని ప్రభుత్వాలు'

### బీసీ విద్యార్థి సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్

నల్లగొండ రూరల్, జూన్ 30 : బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని అన్ని కళాశాలలను బంద్ చేసి నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు బీసీ విద్యార్థి సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన బంద్‌కు సహకరించిన కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, ప్రజా సంఘాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు.అలాగే రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలు, కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.8, 9 వల్ల విద్యార్థుల్లో తీవ్ర గందరగోళం నెలకొందని, ఆ జీవోలను వెంటనే రద్దు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, పీజీ తదితర కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఫీజు బకాయిల కారణంగా కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయకుండా గత 18 సంవత్సరాలుగా అమలులో ఉన్న విధానాన్నే కొనసాగించాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడకుండా వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే జూలై మొదటి వారంలో హైదరాబాద్‌లో ఐదు లక్షల మంది విద్యార్థులతో భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రజక అభివృద్ధి సంస్థ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు సతీష్, విద్యార్థి సంఘం నాయకులు కొంపల్లి రామన్న గౌడ్, అనంత నాగరాజు గౌడ్, గడగోజు విజయాచారి, నాగేష్, హరిప్రసాద్, కృష్ణ, మహేష్, శివ, మధు, మల్లేష్, నరేష్, పృథ్వీరాజ్, మణికంఠ పాల్గొన్నారు.




# 'జడ్జి ఏ ఆర్డర్ అయినా పాస్ చేసుకోమనండి'.. లాయర్ వ్యాఖ్యలు వైరల్

ఢిల్లీ, జూన్ 30: ఆన్‌లైన్ కోర్టు విచారణల సందర్భంగా అప్రమత్తత ఎంత అవసరమో మరోసారి గుర్తు చేసే ఘటన వెలుగులోకి వచ్చింది. వర్చువల్ హియరింగ్ జరుగుతున్న సమయంలో మైక్ ఆన్‌లో ఉందన్న విషయాన్ని గమనించకుండా ఓ గుజరాతీ న్యాయవాది చేసిన వ్యాఖ్యలు కోర్టు లైవ్ స్ట్రీమింగ్‌లో వినిపించడంతో వివాదానికి దారితీసింది. ఈ ఘటనను ప్రస్తావిస్తూ సీనియర్ న్యాయవాది సంజయ్ ఘోశ్‌ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆసక్తికర పోస్టు చేశారు. వర్చువల్ కోర్టు విచారణల సమయంలో న్యాయవాదులు, పక్షాలు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు.సమాచారం ప్రకారం, ఆన్‌లైన్ విచారణ కొనసాగుతున్న సమయంలో ఓ న్యాయవాది ఫోన్‌లో మాట్లాడటం ప్రారంభించారు. మైక్ ఆన్‌లోనే ఉన్న విషయం గుర్తించకుండా ఆయన గుజరాతీ భాషలో తన జూనియర్‌తో సంభాషించారు. తన తండ్రికి ఓపెన్ హార్ట్ సర్జరీ జరుగుతోందని, అందువల్ల తాను కోర్టు విచారణకు హాజరు కాలేనని ఫోన్‌లో చెబుతూ మాట్లాడారు. అయితే ఆ సంభాషణలో భాగంగా 'జడ్జి ఏ ఆర్డర్ ఇవ్వాలనుకుంటే ఆ ఆర్డర్ ఇవ్వమనండి.. తర్వాత సుప్రీంకోర్టుకు వెళ్లి మార్చించుకుంటాను' అనే వ్యాఖ్యలు చేశారు. మైక్ ఆన్‌లో ఉండటంతో ఆ వ్యాఖ్యలు కోర్టు లైవ్ స్ట్రీమింగ్ ద్వారా జడ్జితో పాటు విచారణను వీక్షిస్తున్న అందరికీ స్పష్టంగా వినిపించాయి.ఈ వ్యవహారంతో కోర్టు వర్గాల్లో చర్చ మొదలైంది. న్యాయవ్యవస్థపై గౌరవం, వృత్తిపరమైన బాధ్యతల విషయంలో మరింత జాగ్రత్త అవసరమని [illegible] అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా వర్చువల్ హియరింగ్స్‌లో సాంకేతిక అంశాలపై అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యం ప్రదర్శించడం వల్ల ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయని పలువురు చెబుతున్నారు. వర్చువల్ కోర్టుల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో న్యాయవాదులు, న్యాయపరమైన ప్రక్రియలో పాల్గొనే ప్రతి ఒక్కరూ మైక్, కెమెరా, లైవ్ కనెక్షన్ వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది. అదే సమయంలో న్యాయవ్యవస్థపై గౌరవం, వృత్తిపరమైన నైతిక విలువలు పాటించడం అత్యంత ముఖ్యమని న్యాయవర్గాలు పేర్కొంటున్నాయి.




# రైతులకు రూ.29,300 కోట్ల రైతు బంధు బాకీ పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం : హరీశ్ రావు



జడ్చర్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ఇవాళ హైదరాబాద్‌లో రైతుల ఆశీర్వాద సభ మీటింగ్ పెట్టిండు. నా దృష్టిలో రైతులను అడుగడుగున వంచించినవ్ కదా.. అది రైతు ఆశీర్వాద సభ కాదు.. రైతు వంచన సభ అని పెట్టుకో అని రేవంత్ రెడ్డికి హితవు పలికారు.ఎన్నికల ముందు ఎకరానికి రూ.15 వేలు రైతు బంధు ఇస్తామని హామీనిచ్చిర్రు.. కానీ ఇచ్చిందెంత రూ.12 వేలు.. అవి కూడా ఒక పంట మొత్తానికే 9వేలు ఎగ్గొట్టిండు. ఒక పంట 3 ఎకరాలే ఇచ్చాడు. ఇంకో పంట 2 ఎకరాల వరకే ఇచ్చాడు.. వాళ్లిచ్చిన ప్రకారం లెక్క తీస్తే ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధుపై రూ.29300 కోట్లు రైతు బంధు పేరిట రైతులకు బాకీ పడిందన్నారు హరీశ్ రావు .జడ్చర్ల సభ నుంచి అడుగుతున్నా రేవంత్ రెడ్డి నువ్వు పెట్టుకున్న ఈ రైతు వంచన సభలో రూ.29300 కోట్లు ఎప్పటిలోపు ఇస్తావో తెలంగాణ రైతాంగానికి చెప్పాలని డిమాండ్ చేస్తున్నానన్నారు హరీశ్ రావు. ఈ బాకీ బడ్డ రైతు బంధు డబ్బులు ఎన్ని రోజుల్లోగా తిరిగిస్తావో చెప్పలని తెలంగాణ రైతుల పక్షాన, బీఆర్ఎస్ పార్టీ పక్షాన నేను రేవంత్ రెడ్డిని అడుగుతున్నానన్నారు

# పొలిటికల్ ఎంట్రీపై రాఘవ లారెన్స్ యూటర్న్.. అభిమానులకు భారీ షాక్!



నటుడు రాఘవ లారెన్స్ రాజకీయ ప్రవేశంపై గత కొద్దిరోజులుగా కోలీవుడ్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ జోరుగా చర్చ సాగుతోంది. తను ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలా వద్దా అనే నిర్ణయాన్ని పూర్తిగా తన అభిమానులకే వదిలేస్తున్నట్లు లారెన్స్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పోటీ చేసి తప్పుకున్న తిరుచ్చి ఈస్ట్ (తిరుచిరాపల్లి తూర్పు) నియోజకవర్గం నుంచి లారెన్స్ బరిలోకి దిగబోతున్నారంటూ సోషల్ మీడియాలో విపరీతంగా రూమర్స్ చక్కర్లు కొట్టాయి. ఈ నేపథ్యంలో వాటన్నింటికీ అడ్డుకట్ట వేస్తూ, తన రాజకీయ భవిష్యత్తుపై లారెన్స్ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు.తాజాగా మంగళవారం మధ్యాహ్నం సోషల్ మీడియా వేదికగా దాదాపు 16 నిమిషాల నిడివి గల ఒక సుదీర్ఘమైన వీడియోను పోస్ట్ చేసిన లారెన్స్, తన పొలిటికల్ ఎంట్రీపై పూర్తి క్లారిటీ ఇచ్చారు. వైరల్ అవుతున్న వార్తల్లో నిజం లేదని, తాను తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గం నుండి పోటీ చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే అంతటితో ఆగకుండా, తాను ఎన్నికల్లో పోటీ చేయనంత మాత్రాన రాజకీయాల్లోకి రానని అనుకోవద్దని వ్యాఖ్యానించాడు. ప్రస్తుతం తన పూర్తి ఫోకస్ కేవలం సినిమాలపైనే ఉందని, ఒప్పుకున్న ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడమే తన మొదటి ప్రాధాన్యతని వివరించారు. తాను ప్రత్యక్షంగా ఎన్నికల్లో నిలబడకపోయినా, తన ట్రస్ట్ ద్వారా సమాజానికి చేసే సేవలు మరియు సహాయ కార్యక్రమాలు ఎప్పటిలాగే నిరంతరాయంగా కొనసాగుతాయని ఈ కాంచన హీరో వెల్లడించారు.

# ముత్యాలమ్మగూడెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### టైర్ పేలడంతో డివైడర్ దాటి లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

ఇద్దరు డ్రైవర్లకు గాయాలు, ప్రయాణికులు సురక్షితంకట్టంగూర్, జూన్ 30 : నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజాము ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. భీమవరం నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ఇంటర్‌సిటీ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా టైర్ పేలింది. దీంతో బస్సు అదుపు తప్పి డివైడర్‌ను దాటి ఎదురుగా హైదరాబాద్ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న సిమెంట్ లారీని బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సు డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోగా, లారీ డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. అయితే బస్సులో ఉన్న ప్రయాణికులు అందరూ సురక్షితంగా బయట పడడంతో పెద్ద ప్రమాదం తప్పిందిసమాచారం అందుకున్న స్థానికులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. కట్టంగూర్ 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ శ్రీనివాస్, పైలట్ సమీర్ ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంతో జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించి, ప్రమాదానికి సంబంధించిన కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




# అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు.. అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం..!



అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడికి పాల్పడే అవకాశం ఉందని భారత ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. దాంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. జూలై 3న ప్రారంభం కానున్న ఈ అమర్‌నాథ్ యాత్రకు భద్రతను మరింత పటిష్టం చేసింది. పాకిస్థాన్ లోని ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతాల్లో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయని, వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ భారత్‌లో అలజడి సృష్టించే అవకాశం ఉందని భారత నిఘా సంస్థలు తెలిపాయి.ముఖ్యంగా అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని, జమ్మూకశ్మీర్‌లో అడవుల్లో దాక్కున్న కొంతమంది ఉగ్రవాదులతో పాక్ మూకలు సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోందని ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. పెద్దఎత్తున దాడులు జరిపేలా వారిని ప్రేరేపించే యత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో యాత్ర మార్గంలో భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించారు. ఉగ్రవాద వ్యతిరేక నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. అత్యాధునిక కృత్రిమ మేథ ఆధారిత కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ వ్యవస్థలను కూడా ఏర్పాటుచేశారు. యాత్రికుల భద్రతకు ఎలాంటి లోటులేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.ఇదే సమయంలో జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఆపరేషన్‌లు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ, యాత్రికులు కూడా అధికారిక సూచనలు పాటించాలని, వదంతులను నమ్మవద్దని భద్రతా వర్గాలు సూచిస్తున్నాయి.

# ఎనిమిది కేజీల బంగారానికి సమానమైన నగదును కట్టండి: సుప్రీంకోర్టు..



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన రూ.27 కోట్ల విలువైన గోల్డ్ డీల్ కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వివాదంలో ఉన్న 8 కేజీల బంగారం విలువకు సమానమైన నగదును ఉన్నత న్యాయస్థానంలో డిపాజిట్ చేయాలని నిందితుడికి స్పష్టం చేసింది. 36 కేజీల బంగారం ఒప్పందంలో భాగంగా డబ్బులు తీసుకుని కేవలం 27 కేజీల బంగారమే ఇచ్చారని, మిగిలిన 8 కేజీల బంగారాన్ని ఎగ్గొట్టారని ఆరోపిస్తూ గతంలో ఓ వృద్ధుడిపై మోసం కేసు నమోదు అయ్యింది. ఈ కేసుపై ఇవాళ (మంగళవారం) విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసిందిఒప్పందం జరిగిన సమయంలో ఉన్న మార్కెట్ ధర ప్రకారమే 8 కేజీల బంగారం విలువను లెక్కించాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఆ మొత్తాన్ని మూడు వారాల్లోగా కోర్టు రిజిస్ట్రీలో డిపాజిట్ చేయాలని ఆదేశించింది. అదే సమయంలో 70 ఏళ్ల ఆ వృద్ధుడికి అరెస్ట్ నుంచి షరతులతో కూడిన తాత్కాలిక రక్షణ కల్పించింది. మరోవైపు, 8 కేజీల బంగారం విలువకు సమానమైన నగదును కోర్టులో డిపాజిట్ చేసేందుకు సిద్ధమని ధర్మాసనానికి నిందితుడి తరఫు న్యాయవాది తెలిపారు. దీనిని పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం.. నగదు డిపాజిట్ చేయడంలో విఫలమైతే అరెస్ట్ రక్షణను రద్దు చేస్తామని హెచ్చరించింది. కాగా, జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం ఇచ్చిన ఈ తీర్పు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# ఓటు హక్కు కోల్పోతే, పథకాలూ కోల్పోతారు.. కర్ణాటక సీఎం హెచ్చరిక..

కర్ణాటకలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ మంగళవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కీలక హెచ్చరిక చేశారు. ఓటరు జాబితాలో పేరు లేకపోతే కేవలం ఓటు హక్కే కాకుండా, భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా కోల్పోయే పరిస్థితి రావచ్చని ఆయన హెచ్చరించారు. ఈ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు'ఓటు హక్కు అంటే జీవించే హక్కు. ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలి. పశ్చిమ బెంగాల్‌లో అనర్హ రేషన్ కార్డు లబ్దిదారులను గుర్తించేందుకు ఇలాంటి విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలు కూడా ఇదే తరహా చర్యలు చేపడుతున్నాయి. ఓటు హక్కు కోల్పోతే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కూడా కోల్పోయే అవకాశం ఉంది' అని శివకుమార్ పేర్కొన్నారు భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి జూలై 29 వరకు కర్ణాటకలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించే కార్యక్రమం కొనసాగుతుంది రాష్ట్రవ్యాప్తంగా వేలాది బూత్ స్థాయి అధికారులు ఈ ప్రక్రియలో పాల్గొంటారు. కాగా, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలకు సౌలభ్యం కల్పించేందుకు కర్ణాటక ప్రభుత్వం శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని నిర్ణయించింది. ఈ ధ్రువీకరణ పత్రాన్ని ఆన్‌లైన్‌తో పాటు ప్రభుత్వ సేవా కేంద్రాల్లో కూడా పొందవచ్చు. ఇది నివాసానికి అధికారిక ఆధార పత్రంగా ఉపయోగపడుతుంది.



# గ్రీన్ టీ , బ్లాక్ టీ: రెండింటిలో ఆరోగ్యానికి ఏది బెస్ట్..!?



ఆరోగ్యం కోసం పలు రకాల టీ లు అందుబాటులోకి వచ్చాయి. ఎక్కువగా గ్రీన్ టీతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని చెబుతారు. అదే విధంగా బ్లాక్ టీ తోనూ ఆరోగ్య ప్రయోజనాలు. మరి..ఈ రెండింటి లో ఏది నిజంగా ఆరోగ్యానికి మేలు చేస్తుందనే సందేహం పలువురిలో నెలకొంది. గ్రీన్ టీ, బ్లాక్ టీని వేర్వేరుగా తయారు చేస్తారు. వీటి తయారీకి ఉపయోగించే టీ ఆకులు కూడా వేరేగా ఉంటాయి. అయితే కొందరు గ్రీన్ టీని తాగమని చెబితే, కొందరు బ్లాక్ టీ మంచిదని అంటారు. ఏ టీలో ఎక్కువ పోషకాలు ఉంటాయి..ఏ టీని రోజూ తాగితే మనం ఆరోగ్యంగా ఉండవచ్చో నిపుణులు స్పష్టత ఇస్తున్నారు. అనేక రకాల టీలు అందుబాటులోకి వచ్చినా.. గ్రీన్ టీ, బ్లాక్ టీ కి ప్రత్యేకత ఉంది. ఈ రెండింటికి సంబంధించి తేయాకులను కూడా . కానీ ఈ ఆకులను వేర్వేరుగా ప్రాసెస్ చేస్తారు. దీంతో గ్రీన్ టీ, సాధారణ టీ రెడీ అవుతాయి. గ్రీన్ టీ గా తయారు అయ్యే ఆకులు కాస్త తక్కువ ప్రాసెస్ చేస్తారు. సాధారణ టీ గా మారే ఆకులను ఎక్కువగా ప్రాసెస్ చేస్తారు. వీటిని పొడిగా మారుస్తారు. అనంతరం దీంతో బ్లాక్ టీ తయారు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ రెండు టీలు మనకు దాదాపుగా ఒకేలాంటి లాభాలను అందిస్తాయి. ఈ రెండింటిలో పోషకాలు మాత్రం భిన్నంగా ఉంటాయి. ఈ రెండు టీలలోనూ యాంటీ ఆక్సిడెం ట్లు ఉంటాయి. గ్రీన్ టీని సేవించడం వల్ల కెఫీన్ చాలా తక్కువగా లభిస్తుంది. కానీ బ్లాక్ టీలో కెఫీన్ అధికంగా ఉంటుంది. గ్రీన్ టీని సేవించడం వల్ల మనకు శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అంది స్తాయి. గ్రీన్ టీ కాస్త చేదుగా, వగరుగా ఉంటే, బ్లాక్ టీ పులిసిన రుచిని కలిగి ఉంటుంది. నిపుణుల సూచనలు అదే విధంగా గ్రీన్ టీని తాగితే ఈజీసీజీ అనే సమ్మేళనం లభిస్తుంది. ఇది చాలా శక్తివంత మైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. గ్రీన్ టీమన శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగించి వాపులను తగ్గిస్తుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది. దీని వల్ల బ్రెస్ట్, ప్రోస్టేట్, కోలన్ వంటి క్యాన్సర్లు రాకుండా నివారించవచ్చు. ఇక బ్లాక్ టీలో టీ పొడి ప్రాసెసింగ్‌కు గురవుతుంది కనుక చాలా వరకు ఈజీసీజీ నశిస్తుంది. అయినప్పటికీ పలు ఇతర యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఈజీసీజీ లాంటి లాభాలనే అందిస్తాయి. కానీ చాలా తక్కువ శక్తివంతమైనవి. కనుక క్యాన్సర్లకు అడ్డుకట్ట వేయడంలో బ్లాక్ టీ కన్నా గ్రీన్ టీ ఎంతో మెరుగ్గా పనిచేస్తుంది. ఇక ఈ రెండు టీలు గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని తాగడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షి తంగా ఉండవచ్చు. అయితే మనస్సు ప్రశాంతంగా మారాలంటే మాత్రం గ్రీన్ టీని సేవించాల్సి ఉంటుంది. ఈ రెండు టీలను తాగడం వల్ల జీర్ణ వ్యవస్థకు ఎంతో మేలు జరుగుతుంది. ఉదయం బ్లాక్ టీని, సాయంత్రం గ్రీన్ టీని ఒక కప్పు మోతాదు చొప్పున తాగుతుంటే ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు.

# రెస్టారెంట్ స్టైల్- 'మేథీ చమన్'.. ఒక్కసారి తింటే మళ్లీ మళ్లీ కావాలంటారు..!



మేథీ చమన్ తయారు చేయాలని చాలా మందికి ఉంటుంది. కానీ ఎన్నిసార్లు ట్రై చేసినా కుదరదు. అందుకే చాలా మంది ఈ వంటకాన్ని రెస్టారెంట్ లోనే ఆస్వాదిస్తుంటారు. ఇంట్లో చేసుకోవడానికి వెనకాడుతుంటారు. అయితే ఇంట్లోనే ఈజీగా రెస్టారెంట్ స్టైల్? 'మేథీ చమన్' ను ఇలా తయారు చేసుకుంటే ఇంటిల్లిపాదీ ఇష్టంగా తింటారు. ఈ టేస్టీ కర్రీని ఒక్కసారి ఆస్వాదిస్తే మళ్లీ మళ్లీ కావాలంటారు. మరి ఈ టేస్టీ 'మేథీ చమన్' కర్రీని ఎలా తయారు చేసుకోవాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? పూర్తి వివరాలు ఇక్కడ తెలుసుకుందాం..మేథీ చమన్ తయారీకి కావాల్సిన పదార్థాలు పనీర్ రెండు కప్పులు, మెంతికూర ఒక కప్పు, జీడిపప్పు పేస్ట్ పావు కప్పు, ఉల్లిపాయ ఒకటి పెద్ద సైజులో, టమాటో ఒకటి పెద్దది, పచ్చిమిర్చి రెండు లేదా మూడు, అల్లం వెల్లుల్లి పేస్ట్ ఒక టేబుల్ స్పూన్, పసుపు అర టేబుల్ స్పూన్, ధనియాల పొడి అర టేబుల్ స్పూన్, కారం పొడి ఒక టేబుల్ స్పూన్, ఉప్పు తగినంత, జీలకర్ర అర టేబుల్ స్పూన్, కస్తూరి మేథి ఒకటి లేదా రెండు స్పూన్ లు, గరం మసాలా తగినంత, నీళ్లు తగినంత, నూనె మూడు టేబుల్ స్పూన్ లు తీసుకోవాలి. ఇప్పుడు మేథీ చమన్ తయారీ విధానం చూస్తే ముందుగా పాన్ లో నూనె వేసి వేడి చేసుకోవాలి. అందులో జీలకర్ర, తరిగిన పచ్చిమిర్చి, ఉల్లిపాయ, అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, ధనియాల పొడి వేసి వేయించుకోవాలి. ఆ తర్వాత తరిగిన టమాటో ముక్కలు వేసి వేయించాలి. ఇప్పుడు ఉప్పు, కారం, జీడిపప్పు పేస్ట్ వేసి నూనె తేలేంత వరకూ ఉడికించుకోవాలి. ఆ తర్వాత ఆ మిశ్రమంలో తరిగిన మెంతికూర వేసి నూనె తేలేంత వరకూ ఉడికించుకోవాలి. ఇప్పుడు అందులో పనీర్ ఘనాలను వేసి బాగా కలపాలి. ఆ తర్వాత పనీర్ తురుము వేసి కలపాలి. ఇప్పుడు కావాలిసిన చిక్కదనం మేరకు నీళ్లు పోసి కలపాలి. ఆ తర్వాత క్రీమ్, కసూరి మేథీ, గరం మసాలా వేసి కలుపుకోవాలి. అంతే సూపర్ టేస్టీ మేథీ చమన్ రెడీ అయినట్టే..




# ఆంధ్రా స్టైల్ "రొయ్యల వేపుడు".. ఒక్కసారి రుచి చూస్తే మళ్లీ మళ్లీ తినాల్సిందే!

సీఫుడ్ ప్రియులకు రొయ్యలతో చేసే వంటకాలు అంటే ప్రత్యేకమైన ఇష్టం ఉంటుంది. ముఖ్యంగా ఆంధ్రా స్టైల్ రొయ్యల వేపుడుగురించి చెప్పాలంటే.. కారం, మసాలాల ఘాటు రుచి, కరివేపాకు సువాసన, ఉల్లిపాయల తీపి కలిసి అద్భుతమైన ఫ్లేవర్‌ను అందిస్తాయి. వేడి వేడి అన్నంలో నెయ్యి వేసుకుని ఈ రొయ్యల వేపుడు తింటే ఆ రుచి మాటల్లో చెప్పలేం. అలాగే రోటీ, చపాతీ, పుల్కా, ఫ్రైడ్ రైస్, జీలకర్ర రైస్‌తో కూడా ఇది అద్భుతంగా సరిపోతుంది. ఇంట్లోనే హోటల్ స్టైల్ రుచితో ఈ రెసిపీని చాలా సులభంగా తయారు చేసుకోవచ్చు. రొయ్యల్లో ప్రోటీన్ సమృద్ధిగా ఉంటుంది. ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్లు, సెలీనియం, విటమిన్ ః12 వంటి పోషకాలు శరీరానికి మంచి శక్తిని అందిస్తాయి. సరైన మోతాదులో తీసుకుంటే గుండె ఆరోగ్యానికి, కండరాల బలానికి కూడా మేలు చేస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా కోనసీమ ప్రాంతంలో సముద్రపు ఆహారంతో చేసే వంటకాలకు ప్రత్యేక స్థానం ఉంది. అందుకే మీకోసం ప్రత్యేకంగా ఆ స్టైల్ రెసిపీ తీసుకువచ్చాం. ఎలా చేయాలో స్టెప్ బై స్టెప్ తెలుసుకుందాం..

రొయ్యలు – 250 గ్రాములు (శుభ్రం చేసినవి)ఉల్లిపాయలు – 2 (సన్నగా తరిగినవి)పచ్చిమిర్చి – 2 (పొడవుగా చీల్చినవి)అల్లం వెల్లుల్లి పేస్ట్ – 1 స్పూన్కరివేపాకు – 2 రెమ్మలుకారం – 1½ స్పూన్లుపసుపు –½ స్పూన్ గరం మసాలా – 1 స్పూన్ జీలకర్ర పొడి –½ స్పూన్ (ఐచ్ఛికం) మిరియాల



పొడి –¼ స్పూన్ (మరింత రుచికి) నూనె – 3 నుంచి 4 టేబుల్ స్పూన్లు నిమ్మరసం – 1 స్పూన్ ఉప్పు – తగినంత కొత్తిమీర – కొద్దిగా (సన్నగా తరిగినది)

మ్యారినేషన్ కోసం పసుపు – చిటికెడు కారం –½ స్పూన్ ఉప్పు – తగినంత అల్లం వెల్లుల్లి పేస్ట్ –½ స్పూన్

**తయారీ విధానం..**

ముందుగా రొయ్యలను బాగా శుభ్రం చేసి నల్లనరాన్ని పూర్తిగా తొలగించాలి. తర్వాత ఉప్పు, పసుపు వేసి రెండు నుంచి మూడు సార్లు కడిగి నీరు పూర్తిగా వంపేయాలి. ఇలా చేయడం వల్ల రొయ్యల్లో ఉండే వాసన తగ్గి రుచి మరింత మెరుగవుతుంది.శుభ్రం చేసిన రొయ్యల్లో పసుపు, కారం, ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి బాగా కలిపి కనీసం 30 నిమిషాలు మ్యారినేట్ చేయాలి. ఇలా ఉంచడం వల్ల మసాలా రొయ్యల్లోకి బాగా చేరి వేపుడు మరింత రుచిగా తయారవుతుంది.ఒక మందపాటి కడాయిలో మ్యారినేట్ చేసిన రొయ్యలను వేసి చిన్న మంటపై ఉడికించాలి. రొయ్యల నుంచి సహజంగా నీరు బయటకు వస్తుంది. ఆ నీరు పూర్తిగా ఇంకిపోయే వరకు కలుపుతూ ఉడికించాలి. ఎక్కువసేపు ఉడికిస్తే రొయ్యలు గట్టిపడే అవకాశం ఉంటుంది కాబట్టి జాగ్రత్త.ఇప్పుడు అదే కడాయిలో నూనె వేసి వేడయ్యాక కరివేపాకు, పచ్చిమిర్చి వేసి వేయించాలి. తర్వాత తరిగిన ఉల్లిపాయలు వేసి లేత బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి.ఉల్లిపాయలు వేగిన తర్వాత మిగిలిన అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చివాసన పోయే వరకు వేయించాలి. తర్వాత కారం, పసుపు, జీలకర్ర పొడి, మిరియాల పొడి, ఉప్పు వేసి బాగా కలపాలి.ముందుగా ఉడికించి పెట్టుకున్న రొయ్యలను ఈ మసాలాలో వేసి బాగా కలపాలి. చిన్న మంటపై 8 నుంచి 10 నిమిషాల పాటు వేయించాలి. నూనె పైకి తేలుతూ రొయ్యలు స్వల్పంగా క్రిస్పీగా మారే వరకు ఫ్రై చేయాలి.చివరగా గరం మసాలా చల్లి బాగా కలపాలి. తర్వాత నిమ్మరసం పిండి, కొత్తిమీర చల్లి మరో రెండు నిమిషాలు వేయించి స్టవ్ ఆఫ్ చేయాలి. అంతే ఘుమఘుమలాడే ఆంధ్రా స్టైల్ రొయ్యల వేపుడు సిద్ధం.

**సర్వింగ్ సూచనలు...**

ఈ రొయ్యల వేపుడు వేడి వేడి తెల్ల అన్నం + నెయ్యితో, పప్పు, సాంబార్ లేదా రసం పక్కన.. రోటీ, చపాతీ, పుల్కా.. జీలకర్ర రైస్, ఫ్రైడ్ రైస్, బిర్యానీకి సైడ్ డిష్‌గా తింటే అద్భుతమైన రుచి ఉంటుంది.

**వంట చిట్కాలు..**

రొయ్యలను ఎక్కువసేపు ఉడికించకండి. అలా చేస్తే అవి గట్టిగా మారుతాయి.
కరివేపాకును కొద్దిగా ఎక్కువగా వేస్తే మంచి ఫ్లేవర్ వస్తుంది.
మరింత స్పైసీగా కావాలంటే చివర్లో కొద్దిగా మిరియాల పొడి చల్లండి.
హోటల్ స్టైల్ రుచి కోసం చివర్లో కొద్దిగా నెయ్యి కలిపినా అద్భుతంగా ఉంటుంది.
పొడి పొడిగా ఇష్టపడేవారు చివర్లో మరో 2 నిమిషాలు ఎక్కువసేపు ఫ్రై చేయవచ్చు.

# రవ్వ లడ్డు.. ఇలా రవ్వ లడ్డు చేస్తే తిన్న వాళ్ళు మెచ్చుకోవాల్సిందే!

భారతీయ సాంప్రదాయ వంటకాల్లో, ముఖ్యంగా పండుగలు మరియు శుభకార్యాల సమయంలో చేసుకునే వాటిలో రవ్వ లడ్డుకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. తక్కువ సమయంలో, ఇంట్లో నిత్యం లభించే ఈజీ పదార్థాలతోనే దీనిని ఎంతో సులువుగా తయారు చేసుకోవచ్చు. అయితే, రవ్వ లడ్డు చేసే చాలామంది ఎదుర్కొనే ఏకైక మరియు ఉమ్మడి సమస్య ఏమిటంటే, చేసిన మరునటి రోజుకే అది పొడిబారిపోయి, రాయిలా గట్టిగా మారిపోవడం.

**నోట్లో వేసుకుంటే కరిగిపోయేలా రవ్వ లడ్లు**

చాలామంది ఈ సమస్యతోనే రవ్వ లడ్డు చేయడానికి కాస్త వెనకాడుతుంటారు. ఈ సాధారణమైన సమస్యను అధిగమించి, సుమారు వారం రోజులైనా నోట్లో వేస్తే వెన్నలా కరిగిపోయేలా, ఎంతో మృదువుగా ఉండే రవ్వ లడ్డును ఎలా తయారు చేయాలో ఇప్పుడు వివరంగా చూద్దాం. కొన్ని చిన్న చిన్న సాంప్రదాయ వంటగది చిట్కాలు, పక్కా కొలతలు పాటిస్తే చాలు, వంట గదిలో పెద్దగా అనుభవం లేని వారు సైతం ఎంతో రుచికరమైన రవ్వ లడ్డులను చాలా సులువుగా తయారు చేయవచ్చు.

**నోట్లో కరిగే రవ్వ లడ్డుకు కావలసిన పదార్థాలు**

బొంబాయి రవ్వ: 1 కప్పు (250 గ్రాములు)పచ్చి కొబ్బరి తురుము: అర కప్పు పంచదార: 1 కప్పు



(175 గ్రాములు) నెయ్యి: 3 టేబుల్ స్పూన్లు (50 గ్రాములు) నీళ్లు:100 మిల్లీలీటర్లు జీడిపప్పు, ఎండు ద్రాక్ష: 10 నుండి 15 యాలకల పొడి: 3 నుండి 4 యాలకలది రవ్వ లడ్డుకు రవ్వ వేయించేటప్పుడు జాగ్రత్త రవ్వ లడ్డు తయారీలో ఒక కడాయిలో నెయ్యి వేసి వేడెక్కిన తర్వాత రవ్వను వేసి, మంటను పూర్తిగా తగ్గించి సిమ్ లో ఉంచి మాత్రమే నిరంతరం కలుపుతూ వేయించుకోవాలి. ఎక్కువ మంటపై వేయిస్తే రవ్వ త్వరగా రంగు మారిపోతుంది కానీ లోపల పచ్చిగా ఉండి లడ్డు రుచి దెబ్బతింటుంది. రవ్వ పర్‌ఫెక్ట్‌గా వేగినప్పుడు జీడిపప్పు వేయించిన అద్భుతమైన సువాసన వస్తుంది. పంచదార పాకంలోనే అసలు కిటుకు

నేతిలో వేయించిన వేడి రవ్వలో పచ్చి కొబ్బరి తురుమును నేరుగా కలిపి, కనీసం రెండు గంటల పాటు మూత పెట్టి పక్కన ఉంచాలి. లడ్డులు విరిగిపోకుండా పర్‌ఫెక్ట్ ఆకారంలో స్థిరంగా నిలవడానికి పంచదార పాకం సరిగ్గా రావడం చాలా ముఖ్యం. రవ్వ లడ్డు తయారీకి పంచదార పాకం కచ్చితంగా తీగ పాకం రావాలి. పాకం మరీ పలచగా ఉంటే లడ్డు చుట్టడానికి రాదు.

**ఇలా వస్తేనే రవ్వ లడ్డులు చేయుటం ఈజీ**

అలా అని పాకం ముదిరిపోతే లడ్డులు గట్టిగా గడ్డకడతాయి. కాబట్టి తీగ పాకం రాగానే వెంటనే స్టవ్ ఆపివేయాలి. తీగ పాకం రాగానే యాలకల పొడి, ముందుగా నేతిలో వేయించుకున్న జీడిపప్పు, కిస్మిస్ ముక్కలను అందులో వేయాలి. వెంటనే ఈ వేడి పాకాన్ని రవ్వ మరియు కొబ్బరి మిశ్రమం ఉన్న గిన్నెలో పోసి గరిటెతో బాగా కలుపుకోవాలి. రవ్వ మిశ్రమం పూర్తిగా చల్లారిపోతే లడ్డు చుట్టడం అస్సలు సాధ్యపడదు.

**పాల తాలికలు .. ట్రెడీషనల్ ఆంధ్రా పాయసం!**

నెయ్యితో లడ్డులు చుడితే ఎక్కువ రోజులు నిల్వ :పొడిగా మారిపోయి విరిగిపోతుంటుంది. ఒకవేళ ఏ కారణం చేతనైనా మీకు లడ్డు చుట్టడం రాకపోతే లేదా పొడిగా అయిపోతే, మిశ్రమంపై కొద్దిగా కాచి చల్లార్చిన వేడి పాలను చిలకరించి సులువుగా లడ్డులు చేసుకోవచ్చు. అయితే, పాలు కలిపి చుట్టిన లడ్డులు కేవలం రెండు నుంచి మూడు రోజుల కంటే ఎక్కువ రోజులు నిల్వ ఉండవనే నిజం గుర్తుంచుకోవాలి. ఇలా నెయ్యితో లడ్డులు చుడితే ఎక్కువ రోజుల పాటు రుచి, వాసన అద్భుతంగా ఉంటాయి.

# స్పోర్ట్స్ న్యూస్

## బెన్ స్టోక్స్ రిటైర్‌మెంట్...మనసులో మాట బయటపెట్టిన కోచ్ మెక్‌కల్లమ్!



స్పోర్ట్స్ డెస్క్: ఇంగ్లండ్ టెస్టు జట్టు కెప్టెన్, స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు అకస్మాత్తుగా రిటైర్‌మెంట్ ప్రకటించి అతడి అభిమానులతో పాటు క్రికెట్ ప్రియులను ఆశ్చర్యానికి గురిచేశాడు. న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టెస్టు నాలుగో రోజే అతడు ఈ సంచలన నిర్ణయాన్ని వెల్లడించాడు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 160 పరుగుల తేడాతో ఓడిపోయి, సిరీస్‌ను 1-2తో చేజార్చుకున్నప్పటికీ.. స్టోక్స్ రిటైర్‌మెంట్ వార్తే ప్రత్యేకంగా నిలిచింది.స్టోక్స్ నిర్ణయంపై ఇంగ్లండ్ ప్రధాన కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్ స్పందిస్తూ.. స్టోక్స్ రిటైర్మెంట్ ప్రకటించాడానికి ముందే నిర్ణయాన్ని మార్చుకోవాలని తాను వారించానని వెల్లడించాడు. స్టోక్స్ మనసు మార్చేందుకు తాను ఎంతో ప్రయత్నించానని, కానీ అతడు అప్పటికే మానసికంగా సిద్ధమయ్యాడని మెక్‌కల్లమ్ పేర్కొన్నాడు.ఓస్పోర్ట్స్ ఛానల్ తో మెక్‌కల్లమ్ మాట్లాడుతూ...'స్టోక్స్ తన నిర్ణయాన్ని నాతో చెప్పినప్పుడు మొదట నేను వద్దని సర్ది చెప్పడానికి ప్రయత్నించాను. కానీ అతడి మనసు ప్రశాంతంగా ఉందని, తాను తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉన్నాడని అర్థమైంది. గత నాలుగేళ్లుగా మేమిద్దరం కలిసి సాగించిన ఈ ప్రయాణం ఇంత అకస్మాత్తుగా ముగియడం కొంత బాధగా ఉంది' అని తెలిపాడు.'స్టోక్స్ ఒక గొప్ప కెప్టెన్. మైదానం, డ్రెస్సింగ్ రూమ్, హోటల్.. ఇలా ఎక్కడైనా సరే అందరూ అతడినే అనుసరిస్తారు. ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా జట్టులో ప్రశాంతతను నింపే గొప్ప వ్యక్తిత్వం అతడిది. అలాంటి ఆటగాడి లోటును పూడ్చడం చాలా కష్టం' అని కొనియాడారు. 13 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో క్రికెట్‌ను దాటి అభిమానుల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడని, మైదానంలో అతడికి ఘనమైన వీడ్కోలు దక్కడం సంతోషంగా ఉందన్నారు. ఇకపై కొత్త కెప్టెన్‌తో ఇంగ్లండ్ క్రికెట్‌ను ముందుకు తీసుకెళ్లడంపై దృష్టి పెడతామని మెక్‌కల్లమ్ స్పష్టం చేశాడు.

## వైభవ్ బ్యాటింగ్‌కు ఇంగ్లండ్ సర్‌ప్రైజ్ అవుతుంది: సునీల్ గావస్కర్



పసికూన ఐర్లాండ్ చేతిలో భారత జట్టు 0-2 తేడాతో క్లీన్‌స్వీప్ అయిన సంగతి తెలిసిందే. జులై 1 నుంచి టీమిండియా ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ నేపథ్యంలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రంపైనే అందరి ఆసక్తి నెలకొంది. ఐర్లాండ్‌తో సిరీస్‌లో అతడిని ఆడించకపోవడంపై ఇప్పటికీ చర్చ కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో టీమిండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇంగ్లండ్‌తో జరిగే టీ20 సిరీస్‌కు వైభవ్‌ను ఆడించాలని తెలిపాడు. అతడి విధ్వంసకర బ్యాటింగ్‌కు ఇంగ్లండ్ బౌలర్లు ఆశ్చర్యపోతారని వెల్లడించాడు.'ఇంగ్లండ్‌తో తొలి టీ20లోనే వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నా. ఐర్లాండ్ సిరీస్ ఓటమి నుంచి కోలుకోవడానికి ఇదే సరైన మార్గం. అయితే ఇప్పటికే మంచి ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మ, సంజు శాంసన్ ఓపెనింగ్ జోడీని విడగొట్టడం అంత సులువైన విషయం కాదు. కానీ వైభవ్ వంటి యువ ప్లేయర్ కోసం టీమ్ మేనేజ్‌మెంట్ కఠిన నిర్ణయం తీసుకోక తప్పదు. ఇంగ్లండ్ ప్లేయర్లు ఐర్లాండ్ సిరీస్‌ను చూసి భారత బ్యాటర్లపై కొంత అవగాహన పెంచుకుని ఉంటారు. కానీ వైభవ్ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. అతడి ఐపీఎల్ వీడియోలు తప్ప వారికి మరే సమాచారం లేదు. ఒక్కసారి అతడు జోరందుకుంటే మ్యాచ్‌ను ఒంటిచేత్తో మలిచే సత్తా ఉంది. ప్రస్తుతం భారత్‌కు వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ అవసరం' అని గావస్కర్ వివరించాడు.

**సీనియర్లు అండగా నిలుస్తున్నారు..**

వైభవ్‌కు సీనియర్ ఆటగాళ్లు అందిస్తున్న సహకారాన్ని కూడా గావస్కర్ ప్రశంసించాడు. 'అభిషేక్ శర్మ స్థానానికి వైభవ్ పోటీదారుడే అయినా.. అతడితో మాట్లాడే తీరు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంది. ఇషాన్ కిషన్ కూడా వైభవ్‌కు ఎన్నో విలువైన సూచనలు చేస్తున్నాడు. ఈ కుర్రాడికి ఇంకా 20 ఏళ్లకు పైగా క్రికెట్‌లో భవిష్యత్తు ఉంది. ఈ క్రమంలో సీనియర్లు అతడిని సరైన దారిలో నడిపించడం ప్రశంసనీయం. జట్టులో చోటు దక్కకపోయినా నిరాశ చెందాల్సిన అవసరం లేదు. డ్రెస్సింగ్ రూమ్‌లో కూర్చొని కూడా ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. సీనియర్ ప్లేయర్లు ఎలా ప్రాక్టీస్ చేస్తున్నారు.. వైఫల్యాలను ఎలా ఎదుర్కొంటున్నారు.. ఒత్తిడిని ఎలా అధిగమిస్తారు.. ఇలాంటి అంశాలన్నీ యువ ప్లేయర్లకు ఎంతో ఉపయోగపడతాయి. కొన్నిసార్లు టాలెంట్ ఉన్నప్పటికీ.. మానసిక ధైర్యం కూడా ముఖ్యమే. ప్రస్తుతం వైభవ్ విషయంలో జరుగుతున్న ఈ ఎంపిక ప్రక్రియ అతడి భవిష్యత్తుకు ఎంతో మేలు చేస్తుంది' అని గావస్కర్ వ్యాఖ్యానించాడు.

## బిడ్డ మరణం.. పుట్టెడు దుఃఖంలోనూ వరల్డ్ కప్‌లో గోల్



స్పోర్ట్స్ డెస్క్: చాలా మందిపైకి ఎంతో ప్రశాంతగా కనిపిస్తుంటారు. ముఖ్యంగా క్రీడాకారులు సైతం మైదానంలో ఎంతో సంతోషంగా లేదా గెలుపు సీరియస్ గా కనిపిస్తుంటారు. పలు సందర్భాల్లో కొందరు ఆటగాళ్లు అయితే తాము తీవ్రమైన విషాదంలో ఉన్నప్పటికీ.. అది బయటకు తెలియనివ్వకుండా పంటి బిగువన అదిమిపెట్టి దేశం కోసం ఆడుతుంటారు. ఆ కోవాకు చెందిన ప్లేయరే నెదర్లాండ్స్ ఫుట్‌బాలర్ కూడీ హాక్పో. తాజాగా అతడు కూడా అలాంటి విషాద పరిస్థితినే ఎదుర్కొన్నాడు. లోకం చూడకుండానే తన బిడ్డ మరణించినా.. బాధను దిగమింకుకుని మైదానంలోకి అడుగుపెట్టి ప్రపంచకప్2026లో గోల్ చేశాడు.ఫిఫా ప్రపంచకప్ ( నాకౌట్‌లో భాగంగా ఇవాళ(మంగళవారం) ఉదయం నెదర్లాండ్స్, మొరాకో మధ్య మ్యాచ్ జరిగింది. ఉత్కంఠభరిత పోరులో మొరాకో జట్టు పెనాల్టీ షూటౌట్‌లో నెదర్లాండ్స్‌ను మట్టికరిపించింది. 3-2 తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించి రౌండ్ ఆఫ్-16కు మొరాకో అర్హత సాధించింది. మ్యాచ్ విషయానికి వస్తే.. తొలి 70 నిమిషాల పాటు మొరాకో ఆధిపత్యం చలాయించింది. 72వ నిమిషంలో నెదర్లాండ్ ఆటగాడు కూడీ హాక్పో ఎలాంటి తప్పిదం చేయకుండా బంతిని నెట్స్‌లోకి పంపించడంతో 1-1తో స్కోరు సమం అయింది. సాధారణంగా ఇలాంటి గోల్ చేసినప్పుడు స్ట్రైకర్‌తో పాటు జట్టు సభ్యులంతా సంబరాల్లో మునిగితేలుతారు. కానీ, ఈ మ్యాచ్‌లో మాత్రం అలాంటివేమీ కన్పించలేదు. అందుకు భిన్నంగా నిశ్శబ్దం ఆవరించింది. డచ్ ఆటగాళ్ల ప్రవర్తనను చూసి ప్రేక్షకులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.హాక్పో గోల్ కొట్టగానే అతడు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. మోకాళ్లపై వంగి కన్నీళ్లు పెట్టుకున్నాడు. సహచర ఆటగాళ్లంతా అతడిని చుట్టుముట్టి ఓదార్చారు. అతడికి అండగా నిలిచారు. ఈ మ్యాచ్‌కు సరిగ్గా మూడు రోజుల ముందే హాక్పో తన బిడ్డను కోల్పోయాడు. అతడి రిలేషన్‌షిప్‌లో ఉన్న నోవా వాన్ డెర్ బిజ్ గత శనివారం ఈ విషాదకర విషయాన్ని సోషల్ మీడియా పోస్ట్ చేసింది. ఈ భూమి మీదకు రాకుండానే తమ బిడ్డ తమకు దూరమైందని పేర్కొన్నారు. కూడీ హాక్పో, అతడి భాగస్వామి నోవా 2025లో తొలి బిడ్డకు జన్మనిచ్చా రు.ఫిఫా వరల్డ్‌కప్ టోర్నీకి కొన్ని వారాల ముందు తమకు రెండో బిడ్డ పుట్టబోతున్నట్లు ప్రకటించారు. దురదృష్టవశాత్తూ ఈ బిడ్డ వారికి దూరమైంది. ఈ విషాద సమయంలో హాక్పో తన కుటుంబంతో ఉండేందుకు వీలుగా నెదర్లాండ్స్ మేనేజ్మెంట్ అతడికి సెలవులు ఇచ్చింది.

## వింబుల్డన్ 2026: యువ సంచలనం మీర్రా ఆండ్రీవా శుభారంభం



ఇంటర్నెట్ డెస్క్: ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్ మీర్రా ఆండ్రీవా వింబుల్డన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో పోలండ్‌కు చెందిన మాగ్డా లినెట్‌పై 7-5, 6-4 సెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. టోర్నీలో ఐదో సీడ్‌గా బరిలోకి దిగిన ఈ 19 ఏళ్ల ఆండ్రీవా.. తన తదుపరి రౌండ్‌లో డిఫెండింగ్ వింబుల్డన్ ఛాంపియన్ బార్బోరా క్రెజికోవాతో తలపడనుంది.గతేడాది వింబుల్డన్‌లో క్వార్టర్ ఫైనల్ వరకు అద్భుతంగా రాణించిన ఆండ్రీవా.. ఆఖరి మెట్టుపై బోల్తా పడి టోర్నీ నుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే. ఈసారి కూడా అదే జోరును కొనసాగించి టైటిల్ సొంతం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఇటీవల ముగిసిన ఫ్రెంచ్ ఓపెన్‌లో పోలండ్ ప్లేయర్ మాజా చ్వాలిన్స్కాను ఓడించి తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. వింబుల్డన్ మాజీ ఛాంపియన్ కొన్చితా మార్టినెజ్ శిక్షణలో రాణిస్తున్న ఆండ్రీవా.. అతి పిన్న వయసులో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలిచిన రెండో మహిళా టెన్నిస్ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. ఇప్పుడు అదే ఆత్మవిశ్వాసంతో వింబుల్డన్‌లోనూ ముందుకు సాగుతోంది.

## ఫిఫా ప్రపంచ కప్: నెదర్లాండ్స్‌కు షాక్.. రౌండ్ ఆఫ్ 16కు మొరాకో



ఫిఫా ప్రపంచ కప్‌లో మరో సంచలన విజయం నమోదైంది. ఉత్కంఠభరిత పోరులో మొరాకో జట్టు పెనాల్టీ షూటౌట్‌లో నెదర్లాండ్స్‌ను మట్టికరిపించింది. 3-2 తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించి రౌండ్ ఆఫ్ 16కు మొరాకో అర్హత సాధించింది. తొలుత నిర్ణీత సమయం వరకు ఇరుజట్లు 1-1తో సమంగా నిలవడంతో.. పెనాల్టీ అనివార్యమైంది. పెనాల్టీ షూటౌట్‌లో మొరాకో గోల్‌కీపర్ యాసిన్ బౌనూ కీలక పాత్ర పోషించాడు. నెదర్లాండ్స్ ఐదో షాట్‌గా వచ్చిన క్రెసెన్సియో సుమర్విల్లే ప్రయత్నాన్ని అద్భుతంగా అడ్డుకుని జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. అనంతరం ఇస్మాయిల్ సాబిరీ చివరి పెనాల్టీని గోల్‌గా మలిచి మొరాకోకు చారిత్రక విజయాన్ని అందించాడు. నిర్ణీత సమయానికి ముందే ఈ మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది. రెండో అర్ధభాగంలో కోడీ గాక్‌పో గోల్ చేసి నెదర్లాండ్స్‌కు ఆధిక్యం అందించాడు. అయితే ఇంజూరీ టైంలో మొరాకో అద్భుతంగా పుంజుకుంది. చెమ్‌స్డిన్ తల్బీ ఇచ్చిన క్రాస్‌ను ఇస్సా డియోప్ హెడ్డర్‌తో గోల్‌గా మలిచి స్కోరును సమం చేశాడు. దీంతో మ్యాచ్ అదనపు సమయానికి వెళ్లింది. మొరాకోకు గెలిచే అవకాశం వచ్చినా వెర్‌బుగెన్ అద్భుత సేవ్‌తో అడ్డుకున్నాడు. చివరికి పెనాల్టీల్లో ప్రారంభంలో మొరాకో ఒక షాట్‌ను కోల్పోయినప్పటికీ, తర్వాత తిరిగి పుంజుకుని చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. కాగా ఈ విజయంతో రౌండ్ 16కు చేరుకున్న మొరాకో.. శనివారం కెనడాతో తలపడనుంది.

## ఆసియా గేమ్స్: భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్

: సెప్టెంబర్ 19 నుంచి జపాన్ వేదికగా ఆసియా క్రీడలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం భారత మహిళల క్రికెట్ జట్టు బీసీసీఐ తాజాగా ప్రకటించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా కొనసాగనుంది. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచ కప్‌లో భారత జట్టు ఆశించిన స్థాయిలో రాణించని సంగతి తెలిసిందే. ఈ క్రమంలో హర్మన్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకుంటారని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆసియా గేమ్స్‌కు టీమిండియా కెప్టెన్సీ బాధ్యతలు హర్మన్‌కే అప్పగించడం విశేషం.స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా కొనసాగనుంది. వికెట్ కీపర్, బ్యాటర్ యాస్తికా భాటియాను తప్పించి.. ఆమె స్థానంలో జి.కమిలినిని ఎంపిక చేశారు. మరోవైపు గాయం కారణంగా ఆటకు దూరమైన శ్రేయాంక పాటిల్.. ఫిట్‌నెస్ ఆధారంగా జట్టులో చేరనుంది.



మిగతా జట్టు సభ్యుల్లో కూడా ఎక్కువగా మార్పులు చేయలేదు. బ్యాటింగ్ విభాగంలో షఫాలీ వర్మ, రిచా ఘోష్, జెమిమా రోడ్రిగ్స్ వంటి కీలక ప్లేయర్లు ఉండగా.. బౌలింగ్‌లో దీప్తి శర్మ, శ్రీచరణి, అరుంధతీ రెడ్డి ఎంపికయ్యారు. 2023లో చైనా వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో టీమిండియా మహిళా జట్టు స్వర్ణం గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది మన అమ్మాయిలు డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా బరిలోకి దిగనున్నారు.

**ఆసియా గేమ్స్‌కు భారత జట్టు:**

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), భారతి ఫుల్మాలి, శ్రీచరణి, రేణుకా సింగ్ ఠాకూర్, క్రాంతి గౌడ్, అరుంధతీ రెడ్డి, శ్రేయాంక పాటిల్×, రాధా యాదవ్, నందిని శర్మ.

## వంటమనిషిపై దాడి.. పంజాబ్ కింగ్స్ స్టార్ క్రికెటర్‌పై కేసు

ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ స్టార్ ప్లేయర్ శశాంక్ సింగ్, అతడి తండ్రి రిటైర్డ్ ఐపీఎస్ అధికారి శైలేష్ సింగ్‌పై కేసు నమోదు అయింది. తనపై దాడి చేసి, అసభ్యకర పదజాలంతో దూషించారని ఇంట్లో పనిచేసే వంటమనిషి ఆరోపించాడు. ఈ క్రమంలో బాధితుడు విపేంద్ర సింగ్ తోమర్ భోపాల్‌లో రతీబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శశాంక్ సింగ్, అతడి తండ్రిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఇటీవలే భోపాల్‌కు వచ్చిన విపేంద్ర సింగ్ నెలకు రూ.15 వేల జీతంతో శశాంక్ సింగ్ ఇంట్లో పనికి చేరాడు. ఉచిత భోజనం, వసతి కల్పించడంతోపాటు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇప్పిస్తామని శశాంక్ కుటుంబం హామీ ఇచ్చారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే పనిలో చేరిన కొద్ది గంటల్లోనే మానసికంగా ఒత్తిడి పెట్టడం ప్రారంభించారని, దురుసు ప్రవర్తన, వండిన ఆహారంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అవమానించారని ఆరోపించాడు. ఇవన్నీ భరించలేక ఉద్యోగం మానేసి ఇంటికి వెళ్తాలని చెప్పడంతో వారు ఆగ్రహానికి గురయ్యారని, బయటి వారితో మాట్లాడకుండా తన మొబైల్ ఫోన్ లాక్కొని బలవంతంగా పనిచేయించారని బాధితుడు పేర్కొన్నాడు. భయంతో ఒక గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నప్పటికీ.. శశాంక్ సింగ్, శైలేష్ సింగ్, వారి డ్రైవర్ కలిసి తలుపు బద్దలు కొట్టి తనపై దాడి చేశారని బాధితుడు ఆరోపించాడు.

# సినిమా

## మకుటం' మూవీ లో 'నచ్చాకే వచ్చేరా' సాంగ్ లాంచ్

సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద 99వ ప్రాజెక్ట్‌గా విశాల్ హీరోగా, దర్శకుడిగా చేస్తున్న చిత్రం 'మకుటం'. స్వర్గీయ ఆర్ బీ చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీ నుంచి వచ్చిన టీజర్, ఫస్ట్ సింగిల్ 'ది రైజ్ అఫ్ లింగా' అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా ఆదివారం (జూన్ 28) నాడు సెకండ్ సింగిల్ 'నచ్చాకే వచ్చేరా' అనే పాటను విడుదల చేశారు. ఈ క్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో..



×విశాల్ మాట్లాడుతూ× .. "మకుటం'తో తెలుగు ప్రేక్షకులను పలకరించబోతోన్నందుకు ఆనందంగా ఉంది. ఈ సారి దర్శకుడిగా మారి ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాను. 'శివ' చూసిన తరువాత దర్శకుడిగా మారాలని ఫిక్స్ అయ్యాను. ఇన్నాళ్లకు ఆ కోరిక నెరవేరింది. ఈరోజు ఆర్‌బీ చౌదరి గారిని నేను మిస్ అవుతున్నాను. 99వ ప్రాజెక్ట్ బాధ్యతల్ని ఆయన నాకు ఇచ్చారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ మూవీకి దర్శకుడిగా మారాను. ఆయన నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నానే అనుకుంటున్నాను. ఆయన బ్యానర్ నుంచి పరిచయం అయిన దర్శకుల్లో నేను 45వ వ్యక్తిని. సుబ్రహ్మణ్యం గారు నా మీద పెట్టుకున్న నమ్మకంతోనే 'మకుటం' ఈ స్థాయి వరకు వచ్చింది. ఈ మూవీ కోసమే ఏడాదిపాటుగా నా పర్సనల్ విషయాల్ని పక్కన పెట్టాను. నాకు ఈ ప్రయాణంలో సాయి ధన్సిక ఎంతో అండగా నిలిచారు. 'లింగా' పాట మంచి హిట్ అయింది. అందులో నన్ను సింగర్‌గా చేయడం జీవీ ప్రకాష్ తీసుకున్న రిస్క్ (నవ్వుతూ). 'నచ్చాకే వచ్చేరా' పాటను ప్రభ అద్భుతంగా పాడింది. ఆమె పాడిన ప్రతీ పాట బ్లాక్ బస్టర్ హిట్ అయింది. దర్శకుడిగా ఇది నా మొదటి చిత్రం. నన్ను నమ్మి ఈ ప్రయాణంలో తోడుగా నిలిచిన తోటి ఆర్టిస్టులందరికీ థాంక్స్. నేను ఇంత వరకు పని చేసిన దర్శకులందరి టెక్నిక్స్‌ను ఇందులో వాడాను. ఈ సినిమా కోసం నా బెస్ట్ ఇచ్చాను అని అనుకుంటున్నాను. మూవీ గురించి నేను ఎక్కువగా చెప్పను. ఈ చిత్రాన్ని చూసిన తరువాత ఆడియెన్స్ మాట్లాడతారు. మా నాన్న జీకే రెడ్డి గారి వల్లే నేను ఇక్కడ నిలబడగలిగాను. 'పందెంకోడి' మూవీని ఆయనే పట్టుబట్టి తెలుగులో రిలీజ్ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తెలుగు ప్రేక్షకులు నన్ను ఆదరిస్తూనే ఉన్నారు. ఇప్పుడు దర్శకుడిగా మీ ముందుకు రాబోతోన్నాను. నన్ను ప్రభావితం చేసిన అర్జున్ గారికి, ఆర్జీవీ గారికి థాంక్స్. గత 22 ఏళ్లలో 35 చిత్రాలు చేశాను. ఇంత వరకు నన్ను అభిమానించిన, ఆదరించిన ప్రేక్షకదేవుళ్లకు థాంక్స్. 'మకుటం' ఎలా ఉంది అనేది నేనే ఆడియెన్స్ వద్దకు వచ్చి తెలుసుకుంటాను. 'మకుటం' చిత్రం విజయం సాధించాలని అందరూ కోరుకుంటున్నారు. ఓ మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇస్తాను' అని అన్నారు.

×అంజలి మాట్లాడుతూ× .. "మదగదరాజా' తరువాత విశాల్‌తో కలిసి 'మకుటం' చేశాను. అప్పుడు విశాల్ హీరో.. ఇప్పుడు దర్శకుడు కూడా. ఇందులో నేను ఓ మంచి, పవర్ ఫుల్ రోల్‌ను పోషించాను. విశాల్ నా పాత్రను గొప్పగా తీశాడు. విశాల్‌తో నాకు 15 ఏళ్ల బంధం ఉంది. ఆయన చాలా మంచి వ్యక్తి. ఆయనకు 'మకుటం'తో హీరోగా, దర్శకుడిగా పెద్ద విజయం దక్కాలి. ఈ మూవీ కోసం విశాల్ ఎంతో కష్టపడ్డారు. ఆయన పడిన కష్టానికి తగ్గ ప్రతిఫలం రావాలని కోరుకుంటున్నాను. ఆర్‌బీ చౌదరి బ్యానర్‌లోని 99వ సినిమాలో నేను హీరోయిన్‌గా నటించడం ఆనందంగా ఉంది. జీవీ ప్రకాష్ మ్యూజిక్ ఎప్పుడూ బాగుంటుంది. ఈ చిత్రంలోని 'నచ్చాకే వచ్చేరా' పాట నాకెంతో ఇష్టం. ఈ పాట పెద్ద హిట్ అవుతుంది. 'మకుటం' పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నాను' అని అన్నారు.

×జితన్ రమేష్ మాట్లాడుతూ..× 'విశాల్ మాకు ఎన్నో ఏళ్ల నుంచి తెలుసు. మా ఇంట్లో వ్యక్తిలా, సొంత అన్నలా ఉంటాడు. జీవీ ప్రకాష్ పట్టిందల్లా బంగారం అవుతుంది. మా 'మకుటం' మ్యూజిక్ కూడా పెద్ద హిట్ అవుతుందని అనుకుంటున్నాను. విశాల్ ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతోన్నాడు. అన్నీ తానై విశాల్ ఈ సినిమా కోసం పని చేస్తున్నారు. 99వ ప్రాజెక్ట్‌గా రాబోతోన్న ఈ చిత్రం పెద్ద విజయం కానుంది. వందో ప్రాజెక్ట్ అనేది మా నాన్న గారికి ఎంతో స్పెషల్. ఆయన కోరికను మేం నెరవేర్చుతాం. వంద కాదు రెండొందల ప్రాజెక్టులు చేసి ఆయన లెగసీని కంటిన్యూ చేస్తామ'ని అన్నారు.

×నటుడు అజయ్ మాటాడుతూ× .. 'విశాల్ గారితో 20 ఏళ్ల క్రితం 'భయ్యా' అని ఓ మూవీని చేశాను. మళ్లీ ఇప్పుడు 'మకుటం' చేస్తున్నాను. దర్శకుడిగా విశాల్ ఎలా చేస్తారా? అని అనుకున్నాను. ఆయన చెప్పింది చెప్పినట్టుగా చేశాను. ఆయన ఈ చిత్రంతో అద్భుతం క్రియేట్ చేయబోతోన్నారు' అని అన్నారు.

×నటి ఝాన్సీ మాట్లాడుతూ× .. "నన్ను తమిళంలో పరిచయం చేస్తున్న విశాల్ గారికి థాంక్స్. సూపర్ గుడ్ ఫిల్మ్స్‌తో నాకు ఎంతో అనుబంధం ఉంది. హీరోగా, దర్శకుడిగా అన్ని రకాలుగా విశాల్ ఈ చిత్రంతో అద్భుతం చేశారు. ఇందులో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. అంజలితో పని చేయడం ఆనందంగా ఉంది. ఇది మనందరి సినిమా. 'మకుటం' మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

×సింగర్ ప్రభ మాట్లాడుతూ× .. "మకుటం'లో ఇంత మంచి పాటను పాడే అవకాశం ఇచ్చిన విశాల్ సర్‌కి, జీవీ ప్రకాష్ గారికి థాంక్స్. నేను ప్రైవేట్ ఆల్బమ్స్‌కి పాటలు పాడుతుంటాను. మొదటి సారిగా సినిమాకి పాడటం ఆనందంగా ఉంది' అని అన్నారు.

## ఇడుపు కాయితం మూవీ టైటిల్‌పై రచ్చ

### టైటిల్ మార్చేది లేదన్న దర్శకుడు బన్నీవాసు

ఒక సినిమా విడుదలైన తర్వాత అందులోని పాత్రలు, సన్నివేశాలు, సంభాషణలపై చర్చ.. వివాదాలకు దారి తీయడం ఇప్పటివరకూ చూశాం. ఇటీవల కాలంలో టైటిల్‌తోనే చర్చకు దారితీసిన మూవీ 'ఇడుపు కాయితం'. సోషల్ మీడియాలో పనిగట్టుకుని కొందరు పెట్టిన పోస్టులు వివాదానికి దారితీశాయి. సినిమా భాష, యాస, టైటిల్స్ విషయంలో రెండు వర్గాలుగా విడిపోయి.. ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలకు దిగారు. ఈ క్రమంలో చిత్ర నిర్మాత బన్ని వాస్ స్పందించారు. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదని, కథను బట్టే టైటిల్ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం వివాదం నేపథ్యంలో టైటిల్, కథను మార్చే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఏ సినిమాకైనా కథ, దాని నేపథ్యం బట్టే టైటిల్ ఉంటుంది. దీనిపై ఇక చర్చ అనవసరం. షూటింగ్ పూర్తయి విడుదలైన తర్వాత సినిమానే మాట్లాడుతుంది. ఆంధ్రా, తెలంగాణ ఎవరైనా సరే సినిమా నచ్చితేనే చూస్తారు. నచ్చకపోతే చూడరు. నేను చేయాల్సింది సినిమాను బాగా తీయడంపై దృష్టి పెట్టడమే. ప్రస్తుతం ఈ వివాదం వల్ల సినిమాకు కొంత ఇబ్బంది కలిగిన




మాట వాస్తవం. రేపు సినిమా బాగుంటే అన్నీ సర్దుకుంటాయి. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదు. నాకు పూర్తి నమ్మకం ఉంది. దర్శకుడు వచ్చిన ప్రాంతం, చూసిన వాస్తవ సంఘటనల నుంచి రాసుకున్న కథ ఇది అన్నారు. ప్రియదర్శి, నాగదుర్గ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి వంశీరెడ్డి దొండపాటి దర్శకుడు. ఇడుపు కాయితం అంటే విడాకుల పత్రం.. భార్యాభర్తలు విడిపోవడానికి పెద్దల సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పంద పత్రం. ఇప్పుడు దంపతులు విడిపోవాలనుకుంటే కోర్టులు చుట్టూ తిరుగుతున్నారు.

## ఇరుముడి కట్టు పాట 29న విడుదల

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ డ్రామా 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్, టి-సిరీస్ సంయుక్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్‌ను చిత్ర బృందం ప్రకటించింది. ఈ సినిమా నుంచి మొదటి పాట 'ఇరుముడి కట్టు' పాటను జూన్ 29వ తేదీన ఉదయం 11:07 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, సాయి కుమార్, బేబీ నక్షత్ర, విష్ణుశర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాలో రవితేజ సరికొత్త డివోషనల్ లుక్‌లో కనిపించనున్నారు. ఒక తండ్రి, కూతురి మధ్య ఉండే ఎమోషనల్ బాండింగ్, అయ్యప్ప స్వామి మాల ధారణ ద్వారా ఒక వ్యక్తి జీవితంలో వచ్చే ఆధ్యాత్మిక మార్పుల చుట్టూ ఈ కథ తిరగనుంది. రవితేజ కెరీర్‌లోనే ఇదొక విభిన్నమైన చిత్రంగా నిలవబోతోంది.





## రంభ ఊర్వశి మేనక' మూవీ ఆకట్టుకునే ఫస్ట్ లుక్

విభిన్నమైన కథలు, మంచి కంటెంట్ చిత్రాలతో ఎప్పటికప్పుడు తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటూ వస్తున్న కామెడీ కింగ్ అల్లరి నరేష్, తనను స్టార్ హీరోగా నిలబెట్టిన కామెడీ జానర్‌లో మరోసారి సందడి చేయడానికి సిద్ధమయ్యారు. ఆయన నటిస్తున్న 65వ చిత్రం చఔజీతీవబష్ట్ర65కు చంద్ర మోహన్ చింతాడ దర్శకుడు. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫాంటసీకి వినోదాన్ని జోడిస్తూ తెరకెక్కుతున్న ఈ చిత్రానికి "కామెడీ గోస్ కాస్మిక్" అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌ను ఇచ్చారు. ఈ చిత్రం మ్యాజికల్ ట్విస్టులు, వినోదభరితమైన సంఘటనలతో సరికొత్త థియేట్రికల్ అనుభూతిని అందించబోతుంది.

అల్లరి నరేష్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్‌తో ఈ చిత్రం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇది ఇంతకు ముందెన్నడూ చూడని రీతిలో అద్భుతమైన వినోదాన్ని పంచే ఫాంటసీ కామెడీ చిత్రంగా వుండబోతుంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో అల్లరి నరేష్ స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఆయన స్వర్గలోకపు మెట్లపై కూర్చుని, చేతిలో కలం, 'రంభ, ఊర్వశి, మేనక' పేర్లు రాసి ఉన్న పేపర్ పట్టుకుని ఉండగా, పైన మేఘాల మధ్య అప్సరసలు కనిపిస్తున్నారు. డివైన్ ఎలిమెంట్స్, హాస్యంతో కూడిన ఈ క్రియేటివ్ డిజైన్, ఫాంటసీ, వినోదం, అల్లరి నరేష్ మార్క్ కామెడీ కలగలిసిన ఒక ప్రత్యేకమైన 'కాస్మిక్ ఎంటర్‌టైనర్' అందించబోతోంది.

ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, నరేష్ వి.కె., శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ఇతర ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీరంతా తమ కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేందుకు సిద్ధమవుతున్నారు.

అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి పని చేస్తున్నారు, రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహించగా, చైతన్ భరద్వాజ్ సంగీతం సమకూరుస్తున్నారు. బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తుండగా, చోటా కె. ప్రసాద్ ఎడిటింగ్. అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ ఫాంటసీ ప్రపంచాన్ని అద్భుతంగా తెరపైకి తీసుకురావడానికి చిత్ర బృందం కృషి చేస్తోంది.



వినూత్నమైన టైటిల్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్ పోస్టర్, ఆసక్తికరమైన ఫాంటసీ-కామెడీ కథాంశంతో 'రంభ ఊర్వశి మేనక' ఇప్పటికే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

తారాగణం: అల్లరి నరేష్, వెన్నెల కిషోర్, నరేష్ వీకే, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్ గౌడ్

Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com